ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
శనివారం 27 సెప్టెంబరు 2025



స్థిరమైన అభివృద్ధి మార్గం..పర్యాటకం
● బాపట్లకు ఆహ్లాదం, ఆదాయం.. సూర్యలంక తీరం - నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

హిందూపూర్ వరకు ధర్మవరం ఎక్స్‌ప్రెస్ పొడిగింపు
6లో..



నిడుబ్రోలు - అప్పికట్ల రైల్వే సెక్షన్‌లో నూతనంగా నిర్మించిన డైవర్షన్ మార్గంలో ప్రయాణిస్తున్న రైలు

సూపర్ ఫాస్ట్‌గా రైళ్లు

- 140 కిలోమీటర్ల వేగంతో రాకపోకలు
- నిరోధకాలకు చెక్‌తో వేగవంతంగా ప్రయాణం
- నిడుబ్రోలు-అప్పికట్ల మార్గంలో టెస్టురన్ విజయవంతం

గుంటూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇక రైళ్లు సూపర్‌ఫాస్ట్‌గా రాకపోకలు సాగించనున్నాయి. నిడుబ్రోలు - అప్పికట్ల సెక్షన్‌లో వేగ నిరోధకాలతో అటు విజయవాడ, ఇటు గుంటూరు డివిజన్ల నుంచి వచ్చే పలు రైళ్ల సమయపాలన అదుపుతప్పుతూ వస్తోంది. ఇక్కడ 10 కిలోమీటర్ల పొడవునా నేల స్వభా వం సరిగా లేకపోవడంతో తరచుగా రైళ్ల పట్టాలు తప్పడం వంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో రైళ్లను దాదాపుగా 32 కిలోమీటర్ల పొడవునా 75 నుంచి 90 కిలోమీటర్ల వేగానికి మించి నడపకుండా చూస్తున్నారు. దీని వల్ల ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్టు, వందేభారత్ లాంటి ప్రీమియం రైళ్లు కూడా ఈ సెక్షన్‌లో నెమ్మదిగా ప్రయాణిస్తున్నాయి. సమయపాలన నష్టపోవాల్సి వస్తున్నది. హౌరా - చెన్నై రైలుమార్గంలో దశాబ్దాల తరబడి రైళ్ల రాకపోకలకు ఇబ్బందికరంగా మారిన నిడుబ్రోలు - అప్పికట్ల సెక్షన్‌లో శాశ్వత డైవర్షన్ పనులు పూర్తి అయ్యాయి. పదేళ్ల క్రితమే ఇక్కడి వాగుపై కొత్త వంతెన నిర్మించినప్పటికీ రైలుమార్గం డైవర్షన్ చేపట్టలేదు. ఎట్టకేలకు మూడు స్ట్రెచ్‌లలో ఆరు కట్ అండ్ కనెక్షన్లు చేశారు. పూర్తి అయిన శాశ్వత డైవర్షన్ సెక్షన్‌లో కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ 140 కిలోమీటర్ల వేగంతో టెస్టురన్ నిర్వహించింది. ఎక్కడా ఎలాంటి సమస్య తలెత్తకపోవడంతో క్లియరెన్స్ జారీ చేసింది. దీంతో కొద్ది రోజుల్లోనే ఈసెక్షన్‌లో ఎలాంటి వేగ నిరోధకాలు లేకుండానే రైళ్లను గరిష్ఠ వేగంతో నడపొచ్చని రైల్వే అధికారులు తెలిపారు. రైళ్ల వేగం పెరిగి నిర్ణీత సమయానికి రైళ్లు గమ్యస్థానాలకు చేరుకుంటాయని రైల్వే అధికారులు తెలిపారు. అలానే ఇతర డివిజన్లు, జోన్ల నుంచి రైళ్లను ఆలస్యంగా అందిస్తున్నారన్న ఫిర్యాదులకు కూడా ఫుల్‌స్టాప్ పడుతుంది.

ఎంత ప్రవాహం వచ్చినా తట్టుకునేలా..

నిడుబ్రోలు - అప్పికట్ల సెక్షన్‌లో నేల స్వభావం పటిష్ఠంగా లేని కారణంగా రైలు మార్గం కోసం నిర్మించిన బండ్ ఒరిగిపోతున్నది. అంతేకాకుండా పాతవంతెన శిథిలావస్థకు చేరుకుంది. దీంతో 2014-19 మధ్య అప్పటి జలవనరుల శాఖ నూతన బ్రిడ్జిని నిర్మించింది. వాగులో ఎంత వరద ప్రవాహం వచ్చినా తట్టుకునేలా డిజైన్ చేశారు. వర్షాకాలంలోనూ ఇబ్బంది లేకుండా డైవర్షన్ పనులను పూర్తి చేశారు.

కీలకమైన మార్గం..

ఎప్పుడో బ్రిటీష్ కాలంలో కోస్తా తీరం పొడవునా హౌరా-చెన్నై రైలుమార్గాన్ని నిర్మించారు. దేశంలోని వివిధ రైలు మార్గాల్లో ఇదొక కీలకమైనది. ఉత్తర భారతదేశం నుంచి వచ్చే రైళ్లు కూడా విజయవాడ నుంచి హౌరా-చెన్నై రైలుమార్గంలో ప్రయాణించాల్సిందే. ఈ కారణంగా నిత్యం వందలాది సంఖ్యలో పాసింజర్, ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్టు రైళ్లతో పాటు సరుకు రవాణాకు కూడా ఇదొక ముఖ్యమైన సెక్షన్. దీంతో గూడ్స్ రైళ్లు కూడా ప్రయాణిస్తుంటాయి. ఇంతటి కీలకమైన ఈ రైలుమార్గంలో నిడు బ్రోలు - అప్పికట్ల సెక్షన్ దశాబ్దాల తరబడి ఇబ్బందికరంగా పరిణమించింది.

వీరనారి.. చాకలి ఐలమ్మ

- జమీందార్ల దోపిడీకి ఎదురు నిలిచిన మహిళ
- ప్రజల మనసుల్లో మురికిని తొలగించిన చైతన్యశీలి
- జయంతి వేడుకల్లో కేంద్ర, రాష్ట్ర మంత్రులు పెమ్మసాని, సవిత



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జమీందార్ల దోపిడీకి ఎదురు నిలిచిన వీరనారి చాకలి ఐలమ్మ అని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖా మంత్రి ఎస్.సవిత తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ 130వ జయంతి వేడుకలు గుంటూరులోని మాజేటి కల్యాణ మండపంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ చిట్యాల ఐలమ్మ స్ఫూర్తితోనే బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు పోరాటాలు చేశారన్నారు. అదేమార్గంలో ఎన్టీఆర్ టీడీపీని స్థాపించి బీసీల హక్కుల కోసం నిలబడ్డారన్నారు. ఆ వారసత్వాన్ని నేడు విజనరీ లీడర్, ముఖ్యమంత్రి చంద్రబాబు కొనసాగిస్తున్నారని తెలిపారు. బీసీలకు నాణ్యమైన విద్య అందించేందుకు, హాస్టళ్ల అప్‌గ్రేడ్, కార్పొరేట్ స్కూళ్లతో సమానంగా విద్యార్థులకు అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ చిట్యాల ఐలమ్మ భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా నిలవడమే కాకుండా చుట్టుపక్కల మహిళలను చైతన్యపరిచారన్నారు. ప్రజల మనస్సుల్లోని మురికిని తొలగించార న్నారు. ఐటీ ఉద్యమంతో పేదలందరూ ఉద్యోగాల్లో ఉండేలా చంద్రబాబు కృషి చేశారన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ ఐలమ్మ కులవివక్ష, రాజకీయ అస్థిరతల మధ్య చేసిన పోరాట స్ఫూర్తి అందరికీ మార్గదర్శనీయమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మొహమ్మద్ నసీర్, బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ్‌కుమార్, గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ, ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, కూటమి నేతలు తిరుపతిరావు, దువ్వారపు రామారావు, మల్లేశ్వరరావు, వద్రాణం హరిబాబు, నిమ్మల శేషయ్య, రజక సంఘాల నేతలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సవిత, పక్కన ఎమ్మెల్యే మాధవి

రాజధాని రైతుల నుంచి అర్జీలు స్వీకరణ

తుళ్లూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీల సమస్యల పరిష్కారం కోసం తుళ్లూరులోని సీఆర్‌డీఏ కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహించారు. పలువురు రాజధాని ప్రాంతవాసులు, రైతు కూలీలు అర్జీలను గ్రీవెన్స్ రిడ్రస్సల్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి పి.జయశ్రీకి అందచేశారు. అర్జీదారులు అందచేసిన అర్జీలను సాధ్యమైనంత వేగంగా పరిష్కరిస్తామని నోడల్ అధికారి తెలిపారు. సమస్యలు పరిష్కరించడంలో అలసత్వం వద్దన్నారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరి గే గ్రీవెన్స్ డేను రైతులు వినియోగించుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ కలెక్టర్‌లు ఎం.శేషిరెడ్డి, పి.పద్మావతి, బి.శ్రీనివాస నాయక్, జి.భీమారావు, కె.ఎస్.భాగ్యరేఖ, డెవ లప్‌మెంట్ ప్రమోషన్ విభాగ జోనల్ జాయింట్ డైరక్టర్ సిహెచ్.మధుసూదనరావు, డీసీడీఓ బొర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



రాజధాని రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అధికారి పి.జయశ్రీ



తక్కెళ్లపాడు ఫిల్టరేషన్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ పెమ్మసాని, కలెక్టర్ అన్సారియా తదితరులు

వ్యాధులపై..
అప్రమత్తంగా ఉండాలి

- ప్రజలకు సురక్షితమైన నీటిని అందించాలి
- రూ.15 కోట్లతో రిజర్వాయర్ల ఆధునికీకరణకు చర్యలు
- అధికారులతో సమీక్షలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని
- తక్కెళ్లపాడు ప్లాంట్‌లో తాగునీటి శుద్ధి ప్రక్రియ పరిశీలన

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో డయేరియా ప్రబలుతున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. కలెక్టరేట్‌లోని శంకరన్ కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ గుంటూరు నగర చుట్టుపక్కల ప్రాంతాల్లో 11 లక్షలు జనాభా ఉన్నారని, వారందరికీ స్వచ్ఛమైన, సురక్షిత తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రూ.15 కోట్లతో రిజర్వాయర్ల ఆధునికీకరణ పనులను చేపడతామన్నారు. నగరంలో 167 తాగునీటి నమూనాలు సేకరించి పరీక్షిస్తే అందులో 21 నమూనాలు కలుషితమైనట్లు తెలిసిందన్నారు. రిజర్వాయర్ల దగ్గర సీసీ కెమేరాలు ఏర్పాటుతో పాటు అక్కడి సిబ్బందిపైనా పర్యవేక్షణ చేయాలన్నారు. నీటి శుభ్రత ప్రజారక్షణ వంటి అంశాలకు స్వచ్ఛందంగా పనిచేయడానికి సీనియర్ సిటీజన్లు సిద్ధంగా ఉన్నారని వారి సేవలను సద్వినియోగం చేసుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రస్తుతానికి డయేరియా కేసులు పెద్దగా లేవని, చాలావరకు తగ్గిపోయాయన్నారు. పానీపూరి బళ్లను, చిన్న చిన్న వ్యాపారులను మూసివేయాల్సిన అవసరం లేదన్నారు.

తాగునీటి సరఫరాపై తనిఖీలు

గుంటూరు సమీపంలోని తక్కెళ్ళపాడు రా వాటర్ ఫిల్టరేషన్ ప్లాంట్, స్తంభాలగరువులోని వాటర్ ట్యాంక్‌లను కలెక్టర్ అన్సారియాతో కలిసి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫిల్టరేషన్ ప్లాంట్‌లో నీటిశుద్ధి ప్రక్రియను పరిశీలించారు. ట్రీట్మెంట్ ప్రక్రియ రికార్డులను పరిశీలించారు. స్తంభాలగరువులో పాత వాటర్ ట్యాంకుపై మూత లేకపోవడాన్ని పరిశీలించి అధికారులను వివరణ అడిగారు. మెష్‌లకు మరమ్మతులు చేయించి పక్షులు ట్యాంకులోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్యాంకుల వద్ద పని చేసే సిబ్బంది ఎప్పుడు అప్రమత్తంగా ఉండాలని, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని పెమ్మసాని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో మేయర్ కోవెలమూడి రవీంద్రబాబు, జేసీ అశుతోష్‌శ్రీవాత్సవ, మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు, జనసేన గుంటూరు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, లోక్‌సత్తా అధ్యక్షుడు నారాయణరెడ్డి, అధికారులు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

వరదపై అప్రమత్తంగా ఉండాలి

- లంక గ్రామాల పర్యటనలో కలెక్టర్ అన్సారియా ఆదేశాలు
- అంటువ్యాధులపై జాగ్రత్తగా ఉండాలని సూచనలు



బొమ్మువానిపాలెం గ్రామస్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

కొల్లిపర, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం, భారీ వర్షాల నేప థ్యంలో కృష్ణానదికి వరదలు తగ్గేవరకు అధికారులందరూ అప్రమత్తంగా ఉండా లని కలెక్టర్ తమీమ్‌అన్సారియా ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం బొమ్మువానిపాలెం, అన్నవరంలంక గ్రామాల్లో తెనాలి సబ్‌కలెక్టర్ సంజనాసింహ, ఇన్‌చార్జి తహసీల్దారు గోపాలకృష్ణతో కలిసి కలెక్టర్ పర్యటించారు. ప్రతి ఒక్క అధికారి నదిలో వరద తగ్గే వరకు బాధ్యతగా పని చేయాలని, ఏ మాత్రం అశ్రద్ధగా ఉండవద్దని హెచ్చరించారు. లంక గ్రామాల ప్రజలను కూడా ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. నదిలో వరద ఉధృతిని పరిశీలించి పరిస్థితి గురించి అధికారులను ఆరా తీశారు. 10 లక్షల క్యూసెక్కులను విడుదల చేసినా ఇబ్బంది ఉండదని రైతులు కలెక్టర్‌కు వివరించారు. అంటువ్యాధులు ఏమైనా ప్రబలుతున్నాయా.. ఆరోగ్య సిబ్బంది వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారా లేదా అని గ్రామస్థులను అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. వరద తగ్గే వరకు పిల్లలను నదీ పరిసరాల్లోకి వెళ్లకుండా చూడాలన్నారు. వరదలతో లంకగ్రామాల్లో అంటువ్యాధులు వచ్చే అవకాశం ఉందని, వైద్య శిబిరాలు ఏర్పాటుతో పాటు పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో విజయలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ రాజేష్, ఏవో శ్రీనివాసరెడ్డి, ఆర్ఐ వంశీకృష్ణ, సర్పంచ్ కొల్లి రజని తదితరులు ఉన్నారు.

హార్బర్‌లో 3వ నెంబరు ప్రమాద హెచ్చరిక



రేపల్లె: అల్పపీడనం.. భారీ వర్షాలు.. ఎగువ నుంచి వరదతో కృష్ణానదీ తీర గ్రామాలకు ముంపు పొంచి ఉంది. భారీవర్షం పడితే నదికి 8 నుంచి 9 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వచ్చే పరిస్థితి ఉందని అధికారులు భావిస్తున్నారు. వరద పోటెత్తే అవకాశం ఉందని రెవెన్యూ అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. గతంలో 8 లక్షల క్యూసెక్కులతోనే కరకట్ట అంచుదాకా నీరు ప్రవహించింది. ప్రస్తుతం అదే స్థాయిలో వరద సంభవిస్తే కొంతమేర ఇబ్బందులు పడే అవకాశం ఉంది. కాగా సముద్రంలో అలల ఉధృతి ఎక్కువగా ఉంది. ఈదురుగాలులతో సముద్రం అల్లకల్లోలంగా మారింది. వాతావరణశాఖ ఆదేశాలతో శుక్రవారం నిజాంపట్నం హార్బర్‌లో 3వ నెంబరు ప్రమాద హెచ్చరిక ఎగుర వేసినట్లు పోర్టు అధికారులు తెలిపారు.

ధనలక్ష్మిగా మహాలక్ష్మి

రూ.99,99,999 నోట్లతో అలంకరణ



పెదనందిపాడు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఐదో రోజు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక వాసవీకన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో రూ 99,99,999 నోట్లతో మహలక్ష్మి రూపంలో అమ్మవారిని అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వేదపండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి. 60 ఏళ్లపైబడిన ఆర్యవైశ్య వృద్ధులను ఆర్యవైశ్య సంఘ సభ్యులు సత్కరించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు చిన్నా రామసత్యనారాయణ, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పెంట్యాల సురేష్, వనమా వేణుగోపాల్, కొత్తూరి వెంకట్, కొత్త శ్రీధర్, దాసరి శేషగిరిరావు, దాసరి వాసు పాల్గొన్నారు.



శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో పంచముఖ గాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు



గుంటూరు: మారుతి దేవాలయంలో జరిగిన లలితా సహస్రనామ సహిత కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



శుద్ధి అనంతరం ట్యాంకుల్లో చేరిన నీరు

మురుగు.. శుద్ధి

- మురుగు నీరంతా మంచినీరు
- రూ.30 కోట్లతో తెనాలిలో ప్లాంటు
- పట్టణంలో తీరనున్న మురుగు సమస్య

తెనాలి అర్బన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెనాలిలో మురుగు నీటి శుద్ధి ప్లాంట్లు నిర్మాణం పూర్తయింది. ఇక్కడ రోజుకు కోటి లీటర్ల మురుగు నీటిని శుద్ధి చేసి మంచి నీటిగా మర్చనున్నారు. నాజరుపేట శివారు పూలే కాలనీ వద్ద రెండున్నర ఎకరాల స్థలంలో రూ.30.06 కోట్లతో ప్లాంటును నిర్మించారు. కేంద్ర ప్రభుత్వ అమృత్ పథకంలో భాగంగా చేపట్టిన ఈ ప్లాంటు పనులను 2018లో అప్పటి ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ శంకుస్థాపన చేశారు. గత ప్రభుత్వ విధానాలు, కరోనా కారణంగా నిలిచిపోయిన ప్లాంటు పనులు, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత చకచకా పూర్తయ్యాయి. జంపని డ్రెయిన్ ద్వారా వచ్చిన మురుగునీటిని ప్లాంటుకు అనుసంధానం చేశారు. ఆ నీటిని శుభ్రపరిచేందుకు అవసరమైన బావులు, యంత్రాలు ఏర్పాటు చేశారు. జంపని డ్రెయిన్‌లోకి పట్టణంలోని సింహభాగం మురుగు నీరు, వర్షపు నీరు ప్రవహించి కాలనీ వెలుపలి డ్రెయిన్‌లో కలుస్తుంది. కొన్నేళ్లుగా ఈ డ్రెయిన్ వెంబడి స్థలాలను ఆక్రమించి ఇళ్లు నిర్మించుకోవడంతో కాల్వ వెడల్పు తగ్గిపోయి మురుగునీటి పారుదల సమస్యగా మారింది. వ్యర్థాలతో నిండిపోవడం, డ్రెయిన్ వెడల్పు తగ్గిపోవడం కారణంగా నీటి ప్రవాహం ఆశించిన స్థాయిలో వెళ్లకపోవడంతో పట్టణంలోని పలు ప్రధాన రహదారులు చిన్నపాటి వర్షాలకే చెరువుల్లా మారుతున్నాయి. ఈ సమస్యను గుర్తించిన అధికారులు, ప్రజాప్రతినిధులు మురుగునీటి శుద్ధి ప్లాంటు నిర్మాణానికి ప్రతిపాదించారు.

నెల రోజులుగా ట్రయల్ రన్

ముంబైకి చెందిన కిలారి ఇన్‌ఫ్రా స్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్మాణ బాధ్యతలు చేపట్టి నెల రోజులుగా ట్రయల్ రన్ నిర్వహిస్తోంది. పదేళ్ల పాటు ఈ సంస్థకు చెందిన సిబ్బంది ప్లాంటు నిర్వహణా బాధ్యతలు చూస్తారు. ప్రధాన డ్రెయిన్ నుంచి ఇన్‌లెట్ చాంబర్‌కు వచ్చిన మురుగునీరు చెత్త, వ్యర్థాలు తొలగించి మరో పెద్ద బావిలోకి చేరుస్తారు. ప్రాథమిక ట్రీట్‌మెంట్ పూర్తయ్యాక రెండు భారీ ట్యాంకుల్లోకి మురుగునీరు చేరుతుంది. నీటిని పంపేందుకు 50, 20, 10.5 హెచ్‌పీ స్థాయి భారీ మోటార్లను ఐదింటిని ఏర్పాటు చేశారు. దీనికి తోడు 150 హెచ్‌పీ స్థాయి కలిగిన మూడు బ్లోయర్లు కూడా పనిచేస్తాయి. ఎస్‌బీఆర్ టెక్నాలజీతో మురుగునీటిలో ఉన్న బ్యాక్టీరియాను, క్రిములను నిర్మూలించనున్నారు.

సాగు నీటి అవసరాలకు నీరు

శుద్ధి అయిన నీటిని క్లోరినేషన్ చేసి సాగునీటి కాల్వలకు అవుట్‌లెట్ ద్వారా పంపించే ఏర్పాట్లు చేశారు. శుద్ధి అయిన నీటిని పొలాల అవసరాలతో పాటు ప్లాంటు స్థలంలో గార్డెనింగ్ కోసం, పట్టణంలో అవసరమైన చోట్లకు పంపుతారు. మురుగు నీరు శుద్ధి చేశాక పరీక్షించేందుకు ల్యాబొరేటరీ కూడా నిర్మించారు. ఎప్పటికప్పుడు శుద్ధి అవుతున్న విధానం ఫలితాలను పొల్యూషన్ బోర్డుకు కూడా అందే ఏర్పాటు చేశారు. ప్లాంటును ఈ నెల 14న ప్రారంభించాలని తలపెట్టినప్పటికీ అల్పపీడనం కారణంగా వాయిదా వేశారు.



నీటిని పరీక్షించే ల్యాబ్

అమరావతి రైతులకు..

97 ప్లాట్లు కేటాయింపు



ప్లాటు ప్రొవిజన్ సర్టిఫికెట్ అందజేస్తున్న స్పెషల్ డీసీ వసంతరాయుడు

తుళ్లూరు సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజారాజధాని అమరావతి నిర్మాణానికి భూములిచ్చిన పెనుమాక (జరీబు, మెట్ట), మల్కాపురం(ప్రత్యామ్నాయ) గ్రామాల రైతులకు శుక్రవారం విజయవాడలోని ఏపీ సీఆర్డీఏ కార్యాలయంలో ఈ- లాటరీ విధానంలో 97 రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించారు. వీటిలో 41 నివాస ప్లాట్లు కాగా 36 వాణిజ్య ప్లాట్లు, 20 ప్రత్యామ్నాయ ప్లాట్లు ఉన్నాయి. మొత్తం 56 మంది రైతులు, భూ యజమానులకు ఈ- లాటరీ విధానంలో ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా ప్లాట్లను కేటాయించారు. ముందుగా ట్రైల్ రన్ వేసి తర్వాత ప్రత్యక్ష లాటరీ ప్రక్రియను చేపట్టారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులకు సీఆర్‌డీఏ అధికారులు ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన డైరెక్టర్(ల్యాండ్స్) స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ (క్యాపిటల్ సిటీ) ఎస్ఎస్‌వీటీ వసంతరాయుడు మాట్లాడుతూ.. ప్లాట్లు పొందిన రైతులకు భౌగోళికంగా వారి ప్లాట్లు ఎక్కడ కేటాయించబడ్డాయో వివరించడానికి ప్రత్యేకంగా జి.ఐ.ఎస్. సిబ్బంది, గ్రామ సర్వేయర్లను నియమించామన్నారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని కోరారు. ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ఎలాంటి రుసుము వసూలు చేయబడదన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్డీఏ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఏ.జీ.చిన్నికృష్ణ, బి. సాయి శ్రీనివాస నాయక్, ఇతర అధికారులు, సీఆర్డీఏ సిబ్బంది పాల్గొన్నారు.

29న అమరావతిలో జాబ్ మేళా

తుళ్లూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఈ నెల 29న ఉదయం 10 గంటల నుంచి తుళ్లూరులోని సీఆర్డీఏ స్కిల్ హబ్ కేంద్రంలో జాబ్ మేళా(స్పెషల్ డ్రైవ్) నిర్వహించనున్నారు. ఈ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు అమరావతి పరిసర ప్రాంతాలలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతోందని సీఆర్డీఏ విజయవాడ ప్రధాన కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ జాబ్ మేళాలో టీయూవీ ఇండియా, భవ్య హెల్త్ సర్వీసెస్, మొక్సి ఐటీ డిజిటల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొననున్నారు. సివిల్ ఇంజినీర్, అకౌంటెంట్, సూపర్‌వైజర్, ఆఫీస్ అసిస్టెంట్స్ ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో.. సీఆర్డీఏ సౌజన్యంతో ఈ జాబ్ మేళా నిర్వహించడం జరుగుతోంది. టెన్త్, డిగ్రీ(బీకామ్), బీటెక్(సివిల్ ఇంజినీరింగ్) పూర్తి చేసిన అభ్యర్థులు ఈ స్పెషల్ డ్రైవ్ జాబ్ మేళాకు హాజరుకావచ్చు. అర్హత కలిగిన అభ్యర్థులు తప్పకుండా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్పెషల్ డ్రైవ్ జాబ్ మేళాకు సంబంధించిన పూర్తి వివరాలకు గ్రామంలోని సీఆర్డీఏ ఫెసిలిటేటర్‌ను సంప్రదించవచ్చు. లేదా శంకర్ 98484 24207, శ్రీకర్ 99634 25999 నంబర్లకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటలోపు సంప్రదించవచ్చు. జాబ్ మేళాలో పాల్గొనేవారు నైపుణ్యం పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి.

23,715 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 19,406 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 23,715 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 4,387 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10500	14300
నెంబరు. 5	10000	14100
273	----	----
341	10000	15000
4884	----	----
సూపర్ 10	---	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14500
షార్క్-1	-----	----
బ్యాడిగి	10000	15000
దేవనూరు డీలక్స్	10000	14000

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఆర్మూరు	9800	12000
ఏసీ కామన్ వెరైటీ		
334	10500	14400
నెంబరు. 5	10000	14200
273	---	----
341	10000	15200
4884	10000	13500
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14700
బ్యాడిగి	10000	15200
దేవనూరు డీలక్స్	10500	14200
తాలుకాయలు	5000	7000

స్థిరమైన అభివృద్ధి మార్గం..పర్యాటకం

● బాపట్లకు ఆహ్లాదం, ఆదాయం.. సూర్యలంక తీరం ● నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం





సూర్యలంకలో..పర్యాటకుల సందడి, ఎకో టూరిజం కాటేజీలు

బాపట్ల, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆహ్లాదం, ఆదాయం, ఆరోగ్యం.. కలగలిపిన అభివృద్ధి మార్గం పర్యాటకం. ప్రకృతిని ఆస్వాదిస్తూ.. కాలుష్యాన్ని కట్టడి చేస్తూ.. ఈ రంగాన్ని మరింత విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. శనివారం ప్రపంచ పర్యాటక దినోత్సవం. ఐక్యరాజ్య సమితి ప్రయాణం, ఆర్థికాభివృద్ధి, సాంస్కృతిక అవగాహన, స్థిరమైన అభివృద్ధిని పర్యాటక సంస్థ ఎలా ప్రోత్సహిస్తుందో హైలెట్ చేస్తుంది. ప్రపంచ పర్యాటక దినోత్సవం అనేది సమాజంలో పర్యాటక పాత్ర గురించి అవగాహన పెంపొందించటానికి అంకితమైన ఒక ప్రధాన అంతర్జాతీయ ఆచారం. ఈ ప్రపంచ పర్యాటక దినోత్సవం మన ప్రయాణాలను రాబోయే తరాలకు మరింత బాధ్యతాయుతంగా, స్థిరంగా మార్చాలని గుర్తు చేస్తుంది.

ఏపీలో బీచ్ టూరిజం

ఆంధ్రప్రదేశ్‌లో బీచ్ టూరిజం అభివృద్ధికి ఎంతో అవకాశం ఉంది. శ్రీకాకుళం నుంచి నెల్లూరు జిల్లా వరకు బారువ, కలింగపట్నం, భీమునిపట్నం, రుషికొండ, విశాఖ, గంగవరం, అల్లవరం, మంగినపూడి, సూర్యలంక, ఓడరేవు, కొత్తపట్నం, మైపాడు వంటి ప్రాంతాలు బీచ్ టూరిజానికి ప్రసిద్ధి చెందాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆంధ్రా గోవాగా ఖ్యాతి పొందిన బాపట్లలోని సూర్యలంక సముద్ర తీరానికి తెలుగు రాష్ట్రాలు నుంచి పర్యాటకులు విశేష సంఖ్యలో తరలి వస్తున్నారు. అర్ధ చంద్రాకారంలో ఇక్కడి సముద్రపు తీర ప్రాంతం.. స్వచ్ఛంగా, నిర్మలంగా ఉంటుంది. ఇక్కడ పరిసరాలు పర్యాటకులకు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని కలుగుజేస్తాయి. సూర్యలంక సుందరమనోహర వేదికగా విరాజిల్లుతుంది.

గ్రీన్ ఇన్వెస్ట్‌మెంట్స్..థీమ్..

ప్రతిసంవత్సరం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఒక ప్రత్యేక థీమ్‌తో జరుపుకుంటారు. 2025 థీమ్ పర్యాటకం గ్రీన్ ఇన్వెస్ట్‌మెంట్స్. ఈ థీమ్ స్థిరమైన పర్యాటక మౌలిక సదుపాయాలు, భూమిని రక్షించడంలో సహాయపడే ప్రాజెక్టుల్లో పెట్టుబడి పెట్టాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతుంది. గ్రీన్ ఇన్వెస్ట్‌మెంట్‌లు పర్యాటక వ్యాపారాలు, ప్రయాణికులను అందరికి మెరుగైన భవిష్యత్తును నిర్మించే ఎంపికలను ఎంచుకోవడాకి ప్రోత్సహిస్తాయి.

ఉపాధి కల్పన..

పర్యాటకం లక్షలాది ఉద్యోగాలను సృష్టిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా స్థానిక వ్యాపారాలను పెంచుతుంది. విభిన్న నేపథ్యాల ప్రజల మధ్య అవగాహన, గౌరవం, ప్రశంసలను పెంపొందిస్తుంది. బాధ్యతాయుతమైన పర్యాటకం సమాజాలు తమ వారసత్వం, సంప్రదాయాలను కాపాడుకోవటానికి సహాయపడుతుంది.

బీచ్ ఫెస్టివల్ రద్దు..

ప్రపంచ పర్యాటక దినోత్సవం రోజు సూర్యలంక సముద్ర తీరంలో రూ. 97.52 కోట్లు వెచ్చించి అనేక ప్రాజెక్టుల రూప కల్పనకు శ్రీకారం చుట్టాలని భావించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ద్వారా శంకు స్థాపన చేయించాలని చూశారు. అయితే దీనికి ప్రకృతి సహకరించ లేదు. వాతావరణంలో చోటు చేసుకున్న పెనుమార్పులతో కార్యక్రమం తాత్కాలికంగా వాయిదా పడింది.

సర్వీస్ ఈనాం భూముల సమస్యతో ఇబ్బందులు

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): సర్వీస్ ఈనాం భూముల సమస్యతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, చిలకలూరిపేటలో నివసిస్తున్న సగం మంది ప్రజలకు ఈ సమస్య ఉందని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. శుక్రవారం అసెంబ్లీలో జీరో అవర్‌లో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. 22ఏ(1)సీ గా ఉన్న ఈ సమస్య కారణంగా భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయన్నారు. ఎంతోమంది తమ ఆస్తులను అమ్ముకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం సకాలంలో పరిష్కరించకుంటే ప్రజలు తీవ్ర ఆందోళనతో నిరసన వ్యక్తం చేసే అవకాశం ఉందన్నారు. ఈ సమస్యపై వేసిన సబ్ కమిటీ విచారణ ఏ దశలో ఉందో, సమస్య ఎప్పటికి పరిష్కారమవుతుందో తెలియక ఆందోళన పడుతున్నారని చెప్పారు. ఈ సమస్య పరిష్కారమైతే ప్రజలు ఎన్నో ఏళ్లుగా పడుతున్న ఇబ్బందులు తొలగిపోతాయని తెలిపారు. సమస్య ఎప్పటికి పరిష్కారమవుతుందో తెలియచేయవలసిందిగా సభ ద్వారా ప్రభుత్వాన్ని కోరారు.

చెస్‌ను ప్రపంచానికి పరిచయం చేసిన భారత్

● కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు (విద్య) సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రపంచానికి చెస్ క్రీడను పరిచయం చేసిన ఘనత భారతదేశం సొంతమని.. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న 62వ జాతీయ చెస్ పోటీలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెస్ క్రీడ వ్యూహాత్మక ఆలోచన, క్రమశిక్షణ, నిర్ణయ సామర్థ్యాలను పెంపొందిస్తుందన్నారు. ఈ ఆట వినయాన్ని, ఓటమిలో గౌరవాన్ని నేర్పుతుందన్నారు. డాక్టర్ పెమ్మసాని ముందుగా గ్రాండ్ మాస్టర్ ఎంఆర్ లలిత్‌బాబుతో ఒక ఎత్తు వేసి ఆటను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాభారతం కాలం నుంచి నేటి వరకూ భారతదేశానికి చెస్ క్రీడలో గొప్ప మేధో సంపద, చారిత్రక వారసత్వం ఉందన్నారు. క్రీడాభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమష్టిగా కృషి చేస్తున్నాయన్నారు. విజ్ఞాన్ విద్యాసంస్థల వివిధ విభాగాల డీన్లు పాల్గొన్నారు



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

26 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

విజయపురిసౌత్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి నాగార్జున సాగర్‌కు వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు శుక్రవారం 26 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 587.40 అడుగులు ఉంది. ఇది 305.74 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8,529, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,251, 22 క్రస్ట్‌గేట్లను ఐదు అడుగులు, 4 క్రస్ట్‌గేట్లను పది అడుగులు మేర ఎత్తి 2,30,182, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 2,73,762 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు 2,73,762 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పులిచింల ప్రాజెక్టులో శుక్రవారం 37.32 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 2,50,865 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600, లీకుల ద్వారా 400, తొమ్మిది గేట్ల ద్వారా రూ 2,62,998, మొత్తం 2,79,998 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతోంది.



విద్యుత్ కాంతుల మధ్య విడుదలవుతున్న నీరు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● కృష్ణానది వరద ఉధృతి పెరిగే అవకాశం

రేపల్లె, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం శనివారం కృష్ణా బేసిన్‌లో అతి భారీవర్షం సంభవించే అవకాశం ఉందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ రామలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ భారీవర్షం వల్ల ప్రకాశం బ్యారేజీకి 8 నుంచి 9 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చే అవకాశం ఉందన్నారు. 2వ ప్రమాద హెచ్చరిక స్థాయి దాటే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీని కారణంగా కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల్లో వరద ప్రభావం ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రెవెన్యూ, విపత్తుల నిర్వాహణాధికారులతో ప్రజలు సహకరించాలని కోరారు. కంట్రోల్స్ రూమ్స్‌ను ఏర్పాటు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కొల్లూరు మండలంలో 77948 94544, భట్టిప్రోలు మండలంలో.. 81798 86300, రేపల్లె మండలంలో 95053 22959 రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం 08648 293795ను అత్యవసర సమయాల్లో సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

దుర్గి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బైకును ఎదురుగా వచ్చిన అశోక్ లేలాండ్ వాహనం ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని అడిగొప్పుల వద్ద శుక్రవారం జరిగింది. రాజుపాలెం మండలం దేవరపాడుకు చెందిన చప్పిడి రాము (35) మాచర్ల పట్టణంలోని వివాహ వేడుకకు హాజరై.. పెళ్లికుమార్తె స్వగ్రామమైన మండలంలోని అడిగొప్పులకు బయలుదేరాడు. అడిగొప్పుల కుడి కాలువ వద్ద మాచర్ల వైపు వెళ్తున్న అశోక్ లేలాండ్ వాహనం బైకును ఢీకొంది. తీవ్ర గాయాలపాలైన రామును మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా.. అప్పటికే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బాపట్లలో విజిలెన్స్ విచారణ

బాపట్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పట్టణంలోని ఓ కార్యాలయంలో శుక్రవారం విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం. ఈ విషయం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. అయితే అధికారులు మాత్రం దీనిని గోప్యంగా ఉంచే ప్రయత్నం చేస్తున్నారు. ఒక అధికారితో ఏకాంతంగా మాట్లాడి కొన్ని పత్రాలు అడిగినట్లు తెలిసింది. దీంతో అధికారులు ఎందుకొచ్చారో ఏమిటో అంటూ చర్చించుకుంటున్నారు. అయితే వివరాలు మాత్రం బయట పెట్టలేదు.

ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి



ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరద నీరు

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుతో పాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 2,39,161 క్యూసెక్కుల వరద నీరు దిగువకు విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా దిగువకు 2,30,325, తూర్పు డెల్టా కాల్వకు 4323, పశ్చిమ డెల్టాకు 4513 క్యూసెక్కుల నీరు వదులుతుండగా, గుంటూరు చానల్‌కు నీటి విడుదల నిలిపివేశారు.

అనుమానాస్పద మృతి..

నరసరావుపేట లీగల్, సెప్టెంబర్ 26 (ఆంధ్ర జ్యోతి): మండలం లోని ఇసప్పాలెం గ్రామ పరిధి లో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. ఇస్సపాలెం నుంచి జొన్నలగడ్డ వైపు వెళ్లే రోడ్డులోని నీటి కుంటలో ఓ వ్యక్తి శవం ఉందన్నారు. సుమారు 30 నుంచి 35 సంవత్సరాల వయసు కలిగి ఉంటాడని, మృతదేహం కుడి ఎడమ చాతిపై పచ్చ బొట్టు ఉన్నట్టు తెలిపారు. గుర్తుపట్టినవారు నరసరావుపేట రూరల్ ఎస్సై సెల్ నెంబర్ 94407 96244కు సమాచారం తెలియజేయాలని కోరారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	120, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	222.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	232.00

పారిశ్రామిక ప్రగతికి..

బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు

వినుకొండ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంపద సృష్టి, పెట్టుబడులు, పరిశ్రమల ఆకర్షణలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు, వైసీపీ అధ్యక్షుడు జగన్‌కు పోలికే లేదని వినుకొండ ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ధ్వజమెత్తారు. శాసనసభలో పెట్టుబడులు, మౌలిక వసతులు, ఉపాధి, ఉద్యోగ అవకాశాలపై శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. 2014-19 మధ్య చంద్రబాబు చేసిన అభివృద్ధి, 2019-24 మధ్య జగన్ చేసిన అరాచకాలే అందుకు నిదర్శనమన్నారు. నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు సైబరాబాద్‌ను నిర్మిస్తే 30 లక్షల మందికి ఉద్యోగాలు వచ్చాయన్నారు. కానీ, దోపిడీ వేధింపుల తప్ప మరేం పట్టని జగన్ రాష్ట్రంలో ఉన్న అమర్‌రాజా, లూలూ వంటి సంస్థల్ని తరిమేసి.. ఉన్న ఉద్యోగాలు లేకుండా చేశారని మండిపడ్డారు. అందుకే ప్రజలంతా చంద్రబాబును బ్రాండ్ అంబాసిడర్ అనుకుంటూ ఉంటే.. జగన్‌ను దోపిడీ, పరిశ్రమలను వెళ్లగొట్టడానికి బ్రాండ్ అంబాసిడర్‌గా చూస్తారని చురకలు వేశారు. లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి ఏపీ అత్యుత్తమ స్థానంలో నిలవనుందన్నారు.

హిందూపూర్ వరకు ధర్మవరం ఎక్స్‌ప్రెస్ పొడిగింపు

గుంటూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): భగవాన్ శ్రీ సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని మచిలీపట్నం - ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌ని హిందూపూర్ వరకు పొడిగిస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. నవంబరు 20 నుంచి 26వ తేదీ వరకు 17215 మచిలీపట్నం - హిందూపూర్ ఎక్స్‌ప్రెస్‌గా ప్రయాణిస్తుంది. ఈ రైలు ధర్మవరం రైల్వేస్టేషన్‌కు ఉదయం 9.50 గంటలకు చేరుకొని 10 గంటలకు బయలుదేరి 10.25కి శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం, మధ్యాహ్నం 12.15కి హిందూపూర్ చేరుకుంటుంది. 17216 హిందూపూర్ - మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ నవంబరు 21వ తేదీ నుంచి 27 మధ్యన హిందూపురంలో మధ్యాహ్నం 3.30కి బయలుదేరి సాయంత్రం 4.18కి శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం, 5.20కి ధర్మవరం చేరుకొని మచిలీపట్నంకు బయలుదేరుతుంది.

హైటెక్ సిటీ, చర్లపల్లిలో..

రైళ్ల తాత్కాలిక నిలుపుదల

గుంటూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దసర పండగ సెలవుల రద్దీ దృష్ట్యా నరసపూర్, జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లకు హైటెక్ సిటీ, చర్లపల్లి రైల్వేస్టేషన్లలో నిలుపుదల సౌకర్యాన్ని రైల్వే శాఖ కల్పించింది. 12805 విశాఖపట్టణం - లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ శుక్రవారం నుంచి అక్టోబరు 5వ తేదీ వరకు హైటెక్ సిటీకి సాయంత్రం 6.48కి చేరుకొని 6.49కి బయలుదేరుతుంది. 12806 లింగంపల్లి - విశాఖపట్టణం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఆయా తేదీల్లో ఉదయం 6.20కి హైటెక్ సిటీకి చేరుకొంటుంది. 17255 నరసపూర్ - లింగంపల్లి ఎక్స్‌ప్రెస్ చర్లపల్లికి వేకువజామున 3.44 గంటలకు, హైటెక్ సిటీకి 4.44కి చేరుతుంది. 17256 లింగంపల్లి - నరసపూర్ ఎక్స్‌ప్రెస్ హైటెక్ సిటీకి రాత్రి 9.05కి, చర్లపల్లికి 10.09కి చేరుతుంది.

ఉత్తమ శాస్త్రవేత్తలుగా

ఎస్ఆర్ఎం ప్రొఫెసర్లు..

● స్టాన్ ఫోర్డ్ యూనివర్సిటీ సర్వేలో స్థానం



ఉత్తమ శాస్త్రవేత్తలుగా ఎంపికైన ప్రొఫెసర్లతో వీసీ డాక్టర్ సతీష్ కుమార్

తుళ్లూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలోని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి చెందిన ఏడుగురు ప్రొఫెసర్లకు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు లభించింది. అమెరికాలోని స్టాన్ ఫోర్డ్ యూనివర్సిటీ ఈ ఏడాది జరిపిన ప్రత్యేక సర్వేలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 2 శాతం ఉత్తమ శాస్త్రవేత్తల జాబితాలో వీరికి చోటు దక్కినట్లు ఎస్ఆర్ఎం యూనివర్సిటీ శుక్రవారం పేర్కొంది. పరిశోధనల పరంగా ప్రపంచ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లను తన సర్వే ద్వారా స్టాన్ ఫోర్డ్ యూనివర్సిటీ ఎంపిక చేస్తోందని వెల్లడించింది. ఈ ఏడాది ఎస్ఆర్ఎంకి చెందిన ఏడుగురు ప్రొఫెసర్లను ఎంపిక చేసిందని పేర్కొంది. రీసెర్చ్ వర్క్, పబ్లికేషన్స్ సైటేషన్స్, టాప్ ర్యాంకింగ్ జర్నల్స్‌లో ముద్రితమైన పరిశోధనా వ్యాసాలను పరిగణలోకి తీసుకుని ర్యాంకులు కేటాయిస్తుందని తెలిపింది. వర్సిటీకి చెందిన డాక్టర్ రంగబాష్యం సెల్వంసెంబియన్, డాక్టర్ రణధీర్ కుమార్, డాక్టర్ కార్తీక్ రాజేంద్రన్, డాక్టర్ క్షీరసాగర్ సాహు, డాక్టర్ వినోద్ కుమార్, డాక్టర్ ప్రభుజిత మహాపాత్ర, డాక్టర్ సింటూ భూనియాలు ఎంపికైనట్లు తెలిపింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఎస్ఎర్ఎం యూనివర్శిటీలో ప్రత్యేక అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ఏడుగురు శాస్త్రవేత్తలను సత్కరించింది. ముఖ్య అతిథిగా హాజరైన ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ డాక్టర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ, అకుంఠిత దీక్ష పట్టుదలతో ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడం యూనివర్శిటీకి గర్వకారణంగా ఉందన్నారు. రీసెర్చ్ డీన్ డాక్టర్ రంజిత ధాపా మాట్లాడుతూ.. వచ్చే ఏడాదికి ఈ తరహా గుర్తింపు పొందే.. శాస్త్రవేత్తలు వర్శిటీ ఉంచి 15 మందికి పైగా ఉంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఎంపికైన నలుగురు ప్రొఫెసర్లకు వర్శిటీ తరపున రూ.50వేల నగదు పారితోషకాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. యూనివర్శిటీ డీన్లు డాక్టర్ టామి, వషణనాథ్, రమణరావుతో పాటు హెచ్ఆర్ డైరెక్టర్ ఐజక్ సామల ప్రొఫెసర్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు రిజిస్ట్రార్ డాక్టర్ వినాయక్, డైరెక్టర్లు పంకజ్, శివరంగన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా శనివారం స్తంబాలగరువు, సాయినగర్, శ్యామలానగర్, రవీంద్రనగర్, పట్టాభిపురం ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ ఎస్ గురవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడగాలి

గుంటూరు (మెడికల్), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ భోజనానికి ముందు సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలని గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి సూచించారు. శుక్రవారం ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో రోగులు, వారి సహాయకుల కోసం నిర్వహించే 'మీ కోసం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డయేరియా, ఇతర అంటువ్యాధులు ప్రబలుతున్న నేటి పరిస్థితుల్లో ప్రజలు మంచినీటిని బాగా కాచి చల్లార్చిన తర్వాత తాగాలని డాక్టర్ రమణ కోరారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం పిలుపునిచ్చిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా శానిటేషన్ పరిరక్షణపై ప్రదర్శన జరిపారు. అనంతరం జాగృతి సంస్థ ఆధ్వర్యంలో రోగులకు ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు.

ఆకట్టుకుంటున్న నాటకాలు



సత్యహరిశ్చంద్ర నాటకంలో సన్నివేశం

గుంటూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా చుట్టుగుంట పోలేరమ్మ దేవస్థానం ఎదుట స్టేజీ నాటకాలు ఆకట్టుకుంటున్నాయి. సత్యహరిశ్చంద్ర, శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మంగారి చరిత్ర, బాలనాగమ్మతో పాటు ఇతర నాటకాలు ఆకట్టుకుంటున్నాయి. భక్తులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ఆసక్తిగా తిలకిస్తున్నారు. సత్యహరిశ్చంద్ర నాటకానికి భక్తుల నుంచి విశేష స్పందన వచ్చింది.

ఆకట్టుకున్న దేవి కీర్తనల గానం

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి వారి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శుక్రవారం దేవీ కీర్తనల గానం ఆహుతులను ఆకట్టుకుంది. తొలుత ఆలయ పాలకమండలి వారు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంవై శేషరాణి, భువనేశ్వరి బృందంచే పలు దేవి కీర్తనలను శ్రావ్యంగా ఆలపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. వయోలిన్‌పై చావలి శ్రీనివాస్, మృదంగంపై కిషోర్ వాయిద్య సహకారం అందించారు.

29న జీఎంసీ ఎదుట మహా ధర్నా

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న నగరపాలక సంస్థ అధికారుల తీరుకు నిరసనగా ఈ నెల 29న జీఎంసీ ఎదుట మహాధర్నా నిర్వహిస్తున్నట్టు సీపీఐ నగర కార్యదర్శి ఆకిటి అరుణ్‌కుమార్ తెలిపారు. కొత్తపేట, మల్లయ్య లింగం భవన్లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారుల అలసత్వంతో నగరంలో డయేరియా, కలరా వంటి సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని విమర్శించారు. దీనికి నిరసనగా తలపెట్టిన ధర్నాలో కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నూతలపాటి చిన్న, మంగా శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, జంగాల చైతన్య, రాంప్రసాద్ పాల్గొన్నారు.

నకిలీ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ దందా

● హోటళ్లకు ఫోన్ చేసి బెదిరింపులు
● నగదు పంపించాలంటూ హెచ్చరికలు

గుంటూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నకిలీ ఫుడ్ ఇన్స్పెక్టర్ ల ఆగడాలు శృతిమించుతున్నాయి. చిన్నచిన్న హోటళ్ళు చిరు వ్యాపారులకు ఫోన్లు చేసి లైసెన్స్ ల పేరుతో బెదిరించి వసూళ్లకు పాల్పడుతున్నాడు... ఎవరైనా తమకు ఫుడ్ లైసెన్స్ ఉందని చెబితే ఫామ్ సీ ఉందా... ఇప్పుడే హోటల్‌పై దాడికి స్టాఫ్‌ను పంపిస్తాను అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడు.... గూగుల్ పే ద్వారా డబ్బు పంపాలని బెదిరిస్తున్నాడు. రెండు రోజుల క్రితం తెనాలికి చెందిన హోటల్ నిర్వాహకుడికి ఫోన్ చేసి తన పేరు శంకర్ నాయక్ అని తాను ఫుడ్ ఇన్స్పెక్టర్‌ని అంటూ బెదిరింపులకు దిగాడు. తాజాగా అమరావతి రోడ్‌లోని హోటల్ నిర్వాహకురాలికి ఫోన్ చేసి తన పేరు శ్రీహరి నాయుడు అని తాను ఫుడ్ ఇన్స్పెక్టర్ అని చెప్పి హడావిడి చేసి గూగుల్ పే ద్వారా డబ్బు పంపాలంటూ బెదిరించాడు. ఫుడ్‌సేఫ్టీ అధికారులు స్పందించి సంబంధిత నకిలీలపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

గౌడ సామాజికవర్గాన్ని ఒకేపదంగా ఉంచాలి

● యామా మురళీగౌడ్

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గౌడ సామాజిక వర్గాన్ని మొత్తంగా గౌడ్‌గానే పరిగణించాలని ఏపీ గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యామా మురళీగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. అమరావతి రోడ్డులోని, ఓ హాల్లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గౌడ్ సామాజికవర్గం రాష్ట్ర వ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో గౌండ్ల, గమళ్ల, గౌడ ఇలా కుల ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నారన్నారు. ధ్రువీకరణ పత్రాల్లో తమను వివిధ తెగలుగా చూపించటంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి తమ సమస్యను తెలియజేస్తామని తెలిపారు.



అరండల్‌పేట అష్టలక్ష్మీ ఆలయంలో శ్రీరాజరాజేశ్వరీగా



పట్టాభిపురం, శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ధనలక్ష్మిగా..



ఎస్వీఎన్ కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో మహాలక్ష్మీ దేవిగా..



శారదాకాలనీ 27వలైన్ లోని అమ్మవారి ఆలయంలో మహాలక్ష్మమ్మ అలంకరణ



పొన్నూరు రోడ్డు శ్రీకనకదుర్గ ఆలయంలో శ్రీ మహాలక్ష్మీదేవిగా..

పాహిమాం.. పరాశక్తి

● వైభవంగా దేవీ నవరాత్రులు ● కనువిందు చేస్తున్న అమ్మవారి అలంకారాలు



విద్యానగర్ 3వ లైన్‌లో శ్రీ సాయినాథ సన్నిధానంలో ధనలక్ష్మిగా అమ్మవారు



మారుతినగర్‌లో శ్రీకంచి కామకోటి పీఠ మారుతి దేవాలయంలో మహాలక్ష్మీ దేవిగా అమ్మవారు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): భక్తులను కరుణించే జగన్మాత శరన్నవరాత్రి ఉత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. ఐదో రోజున శుక్రవారం అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు జరిగాయి. గోపూజ, సువాసిని, కుమారి పూజలు సువాసినులచే సామూహిక కుంకుమార్చనలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పలు దేవాలయాల్లో అమ్మవారిని, మహాలక్ష్మీదేవిగా, రాజరాజేశ్వరీ దేవిగా, అన్న పూర్ణదేవిగా, ధనలక్ష్మిగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు అందుకున్నారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

● గుంటూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు నగరంలో వైభవంగా జరుగుతున్నాయి. నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు గాయత్రీదేవి, మహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఏటుకూరు రోడ్డులోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో పంచ ముఖాలతో శ్రీ గాయత్రీదేవిగా, సంగడిగుంట రెడ్ల బజారులోనున్న శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో శ్రీమహా లక్ష్మీ దేవిగా, చుట్టుగుంట పోలేరమ్మ ఆలయంలో శ్రీ మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

నియంత్రణలో అతిసార : కలెక్టర్ అన్సారియా



సీఎస్ విజయానంద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, జేసీ, కమిషనర్

గుంటూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అతిసార వ్యాధి నియంత్రణలో ఉందని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే విజయా నంద్‌కు నివేదించారు. శుక్రవారం చీఫ్ సెక్రటరీ అమరావతిలోని సచివాలయం నుంచి కలెక్టరు, జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 177 కేసులు నమోదయ్యాయన్నారు. గుంటూరు నగరం నుంచి 152 కేసులు రాగా, గ్రామీణ ప్రాంతాల్లో 25 కేసులు నమోదయ్యాయని చెప్పారు. ఆయా ప్రాంతాలకు ప్రత్యేక అధికారులను నియమించి నిశితంగా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రిలో 91 మంది బాధితులు చికిత్స పొందుతున్నారని తెలిపారు. 120 ప్రైవేట్ ఆర్‌వో ప్లాంట్లను గుంటూరు నగరంలో తనిఖీ చేయగా 21 ప్లాంట్లలో హానికారక బ్యాక్టీరియాను గుర్తించామన్నారు. వాటిని తక్షణం సీజ్ చేశామని వివరించారు. అన్ని ప్రాంతాల్లో పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని, దాదాపు 8 వేల గృహాల్లో సర్వే చేశామని అన్నారు. నీటి సరఫరాను నిలిపివేసి ప్రత్యేకంగా ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నామని తెలిపారు. సీఎస్ విజయానంద్ మాట్లాడుతూ అతిసార వంటి వ్యాధులు ప్రబలిన తక్షణం ఆయా ప్రాంతాల్లో తాగునీరు నిలుపుదల చేయడం, పారిశుధ్యం మెరుగుదలపై చర్యలు చేపట్టాలన్నారు. 24 గంటల్లో అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌లను పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, నగర పాలక కమిషనర్ పులి శ్రీనివాసులు, డీఆర్వో ఎస్ఎస్‌కే ఖాజావలి, డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ ప్రసూన, డీపీవో నాగసాయి కుమార్, డీఈవో రేణుక పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు ఏపీఐడీసీ కృషి : చైర్మన్ డేగల



వర్చువల్ సమావేశంలో మాట్లాడుతున్న డేగల ప్రభాకర్

గుంటూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పడిన నాటి నుంచి ఎన్నో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేసిందని కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ అన్నారు. ఏపీఐడీసీ బోర్డు సమావేశాన్ని శుక్రవారం వర్చువల్‌గా నిర్వహించిన ఆయన బోర్డు సభ్యులు, అధికారులతో అనేక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఏపీఐడీసీ కార్పొరేషన్ పూర్తిగా నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. నిర్వీర్యం అయిపోయిన కార్పొరేషన్‌ను మళ్లీ గాడిలో పెట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బోర్డు డైరెక్టర్లకు చైర్మన్ ప్రభాకర్ సూచించారు. రాష్ట్రంలో నూతన పరిశ్రమల ఏర్పాటుతోనే నిరుద్యోగ యువత ఉపాధి లభిస్తుందని, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అనేక మంది పారిశ్రామికవేత్తలు మన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు సుముఖత చూపిస్తున్నారని అన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ చొరవతో రాష్ట్రానికి పెట్టుబడుల ప్రవాహం వస్తోందన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఎండీ రఘునాథ్, డైరెక్టర్లు పండితి మల్హోత్రా, బాల భారతి మట్టపర్తి, జలకం రాజారావు, మనోజ్ కుమార్ భీమిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక

● కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తకా అహ్మద్



మౌలానా ముస్తక్ అహ్మద్‌ను సత్కరిస్తున్న మైనార్టీ నాయకులు

గుంటూరు (తూర్పు), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్టు రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తకా అహ్మద్ అన్నారు. గుంటూరులో జరిగిన రాష్ట్ర మైనార్టీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేషన్ ద్వారా రుణాలు, ఇతర పథకాలను అమలు చేస్తున్నట్టు తెలిపారు. హజ్‌యాత్ర చేసే వారికి లక్ష రూపాయలు ఇచ్చిన ఘనత చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. కమిటీ నాయకుడు లాల్ వజీర్ మాట్లాడుతూ సూపర్ సిక్స్‌లో మైనార్టీ మహిళలే అధికంగా లబ్ధిపొందారని ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం మౌలానాను సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బాజీ, సుభాని, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వారధి పోటీల్లో సత్తా చాటాలి : ఉర్దూ డీఐ ఖాసిం

గుంటూరు (విద్య) సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక పరీక్ష భవన్‌లో గురువారం జరిగిన జిల్లాస్థాయి వారధి పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను, గైడ్ టీచర్లను ఉర్దూ డీఐ ఖాసిం అభినందించారు. ఈ సందర్భంగా ఉర్దూ డీఐ ఖాసీం మాట్లాడుతూ అక్టోబరు 16 నుంచి జరిగే రాష్ట్రస్థాయి వారధి పోటీలకు జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన వారు సిద్ధంగా ఉండాలని కోరారు. తాము ఎంచుకున్న టాపిక్‌లను మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి షేక్ గౌసుల్ మీరా, ప్రధానోపాధ్యాయిని జయప్రద, రీసోర్స్‌పర్సన్‌లు అన్నారావు, ప్రసాదరావు, గైడ్ టీచర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు

వ్యాసరచన విభాగంలో : మొదటి స్థానంలో వట్టిచెరుకూరు ఉన్నత పాఠశాల విద్యార్థిని జె.హేమలత, ద్వితీయ స్థానంలో నూతక్కి ఉన్నత పాఠశాల విద్యార్థిని తేజశ్రీ నిలిచారు.

డిబేట్ విభాగంలో : మొదటి స్థానంలో ఎంటీఎంసీఎచ్ఎస్, మంగళగిరి విద్యార్థిని వి. మాధురి, బి.సంతోషిని నిలిచారు. ద్వితీయ స్థానంలో మాచవరం ఉన్నత పాఠశాల విద్యార్థిని బేబీ సుప్రియ, అమరనాథ్ సాయిలు గెలుపొందారు.

దేశీయ వైద్యుల గుర్తింపునకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ

గుంటూరు (తూర్పు), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ దేశీయ వైద్యం, దానిని అందిస్తున్న వైద్యులను గుర్తించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యచరణ ప్రారంభించిందని ఏపీ, దేశీయ వైద్య సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక అరండల్‌పేట, సంఘం రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్యాచరణలో భాగంగా రాష్ట్ర ఔషధ, సుగంధ మొక్కల బోర్డు వారు దేశీయ వైద్యుల వివరాలను, వారి నైపుణ్యాలను సేకరించే బాధ్యతను తమ సంఘానికి అప్పగించిందని వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పీవీ హనుమంతరావు, కే అంజిబాబు, పి.రామారావు, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని సాహితీకరించిన మహాకవి జాషువా

● డీబీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయకుమార్

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): సమాజాన్ని సాహితీక రించిన మహాకవి గుర్రం జాషువా అని దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయకుమార్ కొనియాడారు. జాషువా జయంతి వారోత్సవాల్లో భాగంగా జాషువా కళాపీఠం ఆధ్వర్యంలో నగరంపాలెంలోని జాషువా విగ్రహం వద్ద ఏపీపీ పరిశపోగు సునీల్‌కుమార్ అధ్యక్షతన శుక్రవారం మహాకవి జాషువా జీవితం - సాహిత్యంపై సభ జరిగింది. ఈ సందర్భంగా కొరివి వినయ్‌కుమార్ మాట్లాడుతూ జాషువా ఉపాధ్యాయుడిగా, రెండో ప్రపంచ యుద్ధ సమయంలో యుద్ధ ప్రచారకుడిగా, భద్రాచల వీడియో కేంద్రంలో కార్యక్రమం నిర్మాతగా పని చేశారని గుర్తుచేసుకున్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ రెక్కల కష్టం చేసుకుని జీవించే పేద వాడిపై జాషువా రాసిన పద్యాన్ని చదివి వినిపించి వివరించారు. అనంతరం నిర్వాహకులు పరిశపోగు సునీల్ కుమార్‌ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అత్తోటజోసఫ్ కుమార్, పినపాటి మోహన్‌రావు, కోటమోహన్‌రావు, పాలకాల వెంకట్, డాక్టర్ మూకిరి సుధ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ నిరులాలో దసరా సంబరాలు



పూజలు నిర్వహిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య

గుంటూరు(విద్య), సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక పలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ నిరుల ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం దసరా సంబరాలు ఘనంగా నిర్వహించారు. విజ్ఞాన విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ అభీష్టదాయిని, శక్తి స్వరూపిణి దుర్గాదేవి అని అన్నారు. ప్రతి సంవత్సరం తొమ్మిది రోజులు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి పూజిస్తారని, కాగా ఈ సంవత్సరం 11 రోజుల పాటు ఈ పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేవీ నవరాత్రుల్లో మొదటి రోజు అమ్మవారిని బాలా త్రిపుర సుందరిగా, ఐదో రోజున మహాలక్ష్మీ దేవిగా, ఎనిమిదో రోజు సరస్వతీ దేవిగా పూజిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పాతూరి రాధిక తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

● ఏపీ గ్రామీణ బ్యాంకు చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి



పారిశుధ్య కార్మికులకు కిట్లను పంపిణీ చేస్తున్న బ్యాంకు చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి తదితరులు

గుంటూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రజలందరి బాధ్యత అని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు చైర్మన్ కె.ప్రమోద్‌కుమార్‌రెడ్డి తెలిపారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బ్యాంకు చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్యామలానగర్ పార్కులో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ పరిశుభ్రతలో కార్మికులు సమాజంలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. వారి కృషి ప్రశంసనీయమన్నారు. ఈ సందర్భంగా 150 మంది మున్సిపల్ పారిశుధ్య కార్మికులను సత్కరించి, రోజువారీ పారిశుధ్య పనులకు అవసరమయ్యే కిట్లను అందజేశారు. కార్యక్రమంలో వ్యాపారవేత్తలు సామినేని కోటేశ్వరరావు, వళ్లంరెడ్డి లక్ష్మారెడ్డి, ఉడుముల శ్రీనివాసరెడ్డి, జనరల్ మేనేజర్లు, మేనేజర్‌లు, బ్యాంకు సిబ్బంది ఉన్నారు.

డీఎస్సీ ద్వారా ఉద్యోగ కల్పన హర్షణీయం

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కత్తెర సురేష్‌కుమార్

గుంటూరు సిటీ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ అభ్యర్థులకు నియామకపత్రాలు అందజేయటం చారిత్రక ఘట్టమే గాక హర్షణీయమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ డీఎస్సీ నిర్వహణకు బాటలు వేసిన ఐటీ విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఈ ఘనత దక్కుతుందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడానికి ప్రతి సంవత్సరం మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంత్రి లోకేశ్‌లు ప్రకటించడం శుభపరిణామం అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా కూటమి అన్ని వర్గాలకు న్యాయం చేస్తుందన్నారు. మొత్తం 15,941 మంది అభ్యర్థులు టీచర్లుగా ఎంపికై నియామక పత్రాలు స్వీకరించారని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తొలిరోజే మొదటి సంతకాన్ని డీఎస్సీపై చేశారని గుర్తు చేశారు. ఈ ఉద్యోగాల రాకతో వేలాది కుటుంబాల్లో హర్షాతిరేకాలు నిండాయి అన్నారు.



ఐలమ్మ విగ్రహం వద్ద నివాళి అర్పించి, కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

ధైర్యానికి, పోరాటానికి ప్రతీక ఐలమ్మ

● ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో భూస్వామ్య వ్యవస్థకు వ్యతి రేకంగా పోరాటానికి నాంది పలికిన వీరనారి చిట్యాల ఐలమ్మ అని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి చెప్పారు. ఐలమ్మ జయంతి సందర్భంగా గుంటూరు చంద్రమౌళి నగర్ మెయిన్ రోడ్డులోని ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి ఆమె నివాళులర్పించి, భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిట్యాల ఐలమ్మ అంటేనే ధైర్యానికి, పోరాటానికి ప్రతీక అన్నారు. ఐలమ్మ త్యాగం, ధైర్యం, పోరాటం ఇవాళ ప్రతి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. 'రజక జాతికి గర్వకారణమైన ఐలమ్మ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించిన నిర్వాహకులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్య క్రమంలో పార్టీ, రజక నేతలు పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

శాసనసభ సమావేశాల్లో శుక్రవారం జీరో అవర్‌లో ఆమె మాట్లాడుతూ రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. రిజర్వేషన్ లేకుండా అన్ని కులాలు సమానంగా అభివృద్ధి చెందే రోజు రావాలని తాను కోరుకుంటున్నానని, కానీ సామాజి కంగా, ఆర్థికంగా వెనుకబడిన కొన్ని కులాల అభ్యున్నతికి రిజర్వేషన్ ఒక పెద్ద ఊతం అవుతోందన్న విషయాన్ని మాత్రం విస్మరించలేమని అన్నారు. 'దేశంలో 17 రాష్ట్రాల్లో రజకులు ఇప్పటికే ఎస్సీ జాబితాలో ఉన్నారని, రజకుల స్థితిని గమనించి, టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ 1985లోనే కేంద్రానికి రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని లేఖ రాశారని ఆమె గుర్తు చేశారు. ఈ సందర్భంగా అసెంబ్లీలో మాధవి ఐలమ్మకు నివాళి అర్పించారు.



ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే నసీర్

మసీదుల అభివృద్ధికి నిధులిప్పించండి

● ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మసీదులు నిర్మాణానికి, మరమ్మతులకు, కబరస్తాన్ల అభివృద్ధి వక్ఫ్ బోర్డు ద్వారా రివాల్వింగ్ ఫండ్ ఇప్పించాలని గుం టూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో శుక్రవారం ఆయన మైనార్టీల సమస్యలపై మాట్లాడారు. అనంతరం రాష్ట్రంలో మసీదులు, కబరస్తాన్ల నిర్మాణాల విషయాన్ని సభ దృష్టికి తీసుకొచ్చారు. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డులు విడిపోయాయని, ఆ సమయంలో ఏపీకి రూ.63 కోట్లు రావాల్సి ఉందని చెప్పారు. ఈ నిధులను వెంటనే విడుదల చేయించాలని కోరారు. వక్ఫ్ బోర్డు రివాల్వింగ్ ఫండ్ కేటాయించడం ద్వారా మసీదులు, కబరస్తాన్లను అభివృద్ధి చేసుకోవడానికి వీలు కలుగుతుందని తెలిపారు. ఈ మేరకు నిధులు మంజూరు చేయాలని సీఎం చంద్రబాబు, మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి మహ్మద్ ఫరూక్‌ను కోరా రు.

స్పీకర్‌కు ఎమ్మెల్యే నసీర్ ధన్యవాదాలు

అసెంబ్లీలో స్పీకర్ అయ్యన్నపాత్రుడును ఎమ్మెల్యే నసీర్ ఘనంగా సత్కరించారు. అసెంబ్లీ లెజిస్లేటివ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్‌గా అవకాశం కల్పించినందుకుగా ప్రత్యేక ధన్య వాదాలు తెలిపారు. పదవిని బాధ్యతగా తీసుకుని మైనారిటీల సంక్షేమానికి, అభ్యున్నతికి కృషి చేస్తామని స్పష్టం చేశారు.

ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ నుంచి విముక్తి కోసం జమీందారీ వ్యవస్థపై ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకమని నసీర్ అన్నారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భం గా శుక్రవారం నగరంలోని రజకసత్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. తొలుత ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కృపాదాస్‌కు ఉత్తమ ఉద్యోగ పురస్కారం

● తులసీ ధర్మచరణ్



హైదరాబాద్‌లో ఉత్తమ ఉద్యోగి పురస్కారం అందుకుంటున్న కృపాదాస్

గుంటూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకుడు కృపాదాస్‌కు హైదరాబాదులో ఉమ్మడి రాష్ట్రాల సీడ్స్ మెన్ అసోసియేషన్ వారు ఉత్తమ ఉద్యోగి పురస్కారం అందించటం ప్రతిభకు పట్టం కట్టడమేనని వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్, మేనేజింగ్ డైరెక్టర్ పి.చంద్రశేఖర్‌లు శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. నిబద్దతకు నిలువుటద్దం.. ప్రతిభకు ప్రతి రూపమైన కృపాదాస్ ఈ గౌరవం అందుకోవడం గర్వకారణం అన్నారు. రైతులకు కృపా దాస్ విశేష సేవలు అందించారని ప్రశంసించారు. ఉత్తమ ఉద్యోగి పురస్కారం అందు కున్న కృపాదాస్‌ను వేద సీడ్స్ తరఫున ఘనంగా సత్కరించారు.

రైతు సంక్షమమే ధ్యేయంగా నాట్కో క్రాప్ హెల్త్ సైన్సెస్

గుంటూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ధ్యేయంగా నాట్కో క్రాప్ హెల్త్ సైన్సెస్ పని చేస్తుందని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ రాజేష్ చెబియం అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం బృందావన్‌గార్డెన్స్‌లో నాట్కో సంస్థకు చెందిన సయా నట్, అట్మాస్, ఆస్టార్ క్రిమి సంహారక మందుల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రాజేష్ చెబియం మాట్లాడుతూ వివిధ పంటల్లో ముఖ్యంగా మిరప పంటలో తామర పురుగుల నివారణకు ఈ మందులు బాగా పని చేస్తాయన్నారు. బలమైన దిగుబడులు అందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో నాట్కో అధికారులు సార నర్సయ్య, ఈ నాగిరెడ్డి, డాక్టర్ గోపు అజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలపై దశలవారి ఆందోళనలు

● యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ముజఫర్

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలో పని చేసే ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై దశల వారి ఆందోళనలకు సిద్ధమవుతున్నట్టు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ముజఫర్ అహమద్ స్పష్టం చేశారు. గుంటూరు, సీపీఎం కార్యాలయంలో యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. 2022 పీఆర్సీ బకాయిలు నేటికి చెల్లించకపోవడం అన్యాయమన్నారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

నవ్య
కుటుంబ కదంబం
శనివారం 27 ● సెప్టెంబరు 2025



వంటిల్లు

దసరా పండుగ వస్తుందనగానే రకరకాల పిండి వంటలు చేసుకుంటూ ఉంటాం. ఒక్కో ప్రాంతంలో ఒక్కో వంటకం ప్రాశస్త్యంలో ఉంటుంది. మనం కూడా వాటిని ప్రయత్నించవచ్చు. ఎప్పటిలా కాకుండా ఈ పండుగ రోజున విభిన్నంగా ఆస్వాదించాలనుకునేవారి కోసమే ఈ రుచులు...

విజయదశమికి వైరైటీగా..

పాల పాయసం (కేరళ)



కావాల్సిన పదార్థాలు

బాస్మతి బియ్యం- అర కప్పు, చిక్కటి పాలు- ఒక లీటరు, పంచదార- ఒక కప్పు, యాలకులు- నాలుగు, కుంకుమ పువ్వు రేకులు- అయిదు, నెయ్యి- రెండు చెంచాలు, జీడిపప్పు- కొద్దిగా, బాదం పలుకులు- కొన్ని, కిస్‌మిస్‌లు- కొన్ని, ఉప్పు- చిటికెడు

తయారీ విధానం: బాస్మతి బియ్యంలో నీళ్లు పోసి రెండుసార్లు కడగాలి. స్టవ్ మీద కుక్కర్ పెట్టి అందులో మూడు కప్పుల నీళ్లు, కడిగిన బాస్మతి బియ్యం వేసి కలపాలి. మూతపెట్టి రెండు విజిల్స్ వచ్చే వరకు ఉడికించి దించాలి. కుక్కర్ చల్లారాక మూత తీసి బాస్మతి అన్నాన్ని గరిటెతో మెత్తగా మెదపాలి. స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి పాలు పోసి బాగా మరిగించాలి. తరువాత అందులో బాస్మతి అన్నం మిశ్రమాన్ని వేసి బాగా కలుపుతూ పావుగంటసేపు ఉడికించాలి. ఆపైన పంచదార, యాలకుల పొడి, కుంకుమ పువ్వు రేకులు వేసి కలపాలి. పంచదార కరిగిన తరువాత పాయసం గిన్నెను స్టవ్ మీద నుంచి దించాలి. స్టవ్ మీద చిన్న గిన్నె పెట్టి నెయ్యి వేసి కరిగించాలి. అందులో జీడిపప్పు, బాదం పలుకులు, కిస్‌మిస్‌లు వేసి దోరగా వేయించి పాయసంలో కలపాలి. చివరగా చిటికెడు ఉప్పువేసి కలిపితే రుచికరమైన పాల పాయసం రెడీ!

దెహరోరి (చత్తీస్‌ఘర్)



కావాల్సిన పదార్థాలు

బియ్యప్పిండి- ఒక కప్పు, పెరుగు- ఒక కప్పు, బేకింగ్ సోడా- అర చెంచా, బొంబాయి రవ్వ- రెండు చెంచాలు, పంచదార- ఒక కప్పు, యాలకుల పొడి- అర చెంచా, నూనె- తగినంత, జీడిపప్పు పలుకులు- కొన్ని, బాదం పలుకులు- కొన్ని

తయారీ విధానం: వెడల్పాటి గిన్నెలో బియ్యప్పిండి, బేకింగ్ సోడా, బొంబాయిరవ్వ, యాలకుల పొడి, పెరుగు వేసి అరగ్లాసు నీళ్లు పోసి బాగా కలపాలి. ఆపైన గిన్నెమీద మూతపెట్టి నాలుగు గంటలు నాననివ్వాలి.

- స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో చక్కెర వేసి కొన్ని నీళ్లు చిలకరించి వేడిచేయాలి. గులాబ్‌జామ్ పాకంలా రానివ్వాలి.
- స్టవ్ మీద మూకుడు పెట్టి సగానికిపైగా నూనె పోసి వేడిచేయాలి. బియ్యప్పిండి మిశ్రమాన్ని చెంచాతో తీసుకుంటూ నూనెలో బోండాల మాదిరి వేయాలి. ఇవి దోరగా వేగిన తరువాత వాటిని తీసి పంచదార పాకంలో వేయాలి. పావుగంట తరువాత బోండాలన్నీ పూర్తిగా పాకం పీల్చుకుని దెహరోరీలు తయారవుతాయి. వీటి మీద జీడిపప్పు, బాదం పలుకులు చల్లి సర్వ్ చేయడమే.

ఈ రైతు బిడ్డ.. డీఎస్పీ



సంకల్పం

చిన్నప్పటి నుంచీ ఒకటే ఆశయం... ఉన్నత హోదా అలంకరించాలని. ఆ దృఢ సంకల్పమే ఆమెను లక్ష్యం వైపు నడిపించింది. కుటుంబ కష్టాలు... ప్రతికూల పరిస్థితులు... ఇవేవీ ఆమె అవరోధంగా భావించలేదు. చదివింది ప్రభుత్వ పాఠశాలలో అయినా... అకుంఠిత దీక్షతో అనుకున్నది సాధించారు. మండ్ల కవిత... ఇటీవల విడుదల చేసిన గ్రూప్-1 ఫలితాల్లో 480వ ర్యాంకు సాధించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా ఎంపికయ్యారు. ఒక పేద రైతు బిడ్డ సాధించిన ఈ అపురూప విజయం 'నవ్య' పాఠకుల కోసం...

మండ్ల కవిత స్వస్థలం... వనపర్తి జిల్లా రేవల్లి మండలంలోని శానాయపల్లి. ఆమె తండ్రి మండ్ల నాగయ్య. తల్లి పార్వతమ్మ. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు. కవిత రెండో కూతురు. పెద్ద కూతురు విజయలక్ష్మికి పెళ్లయింది. కుమారుడు సాయితేజ సివిల్స్‌కు సన్నద్ధమవుతున్నాడు. వ్యవసాయమే ఆధారమైనా... పిల్లలను ఉన్నత చదువులు చదివించాలనుకున్నారు నాగయ్య. పంటపై వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో... వ్యవసాయ పనులతో పాటు జేసీబీ ఆపరేటర్‌గా కూడా పని చేశారు. ప్రస్తుతం గ్రామంలోనే పాల వ్యాపారం చేస్తున్నారు. కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో కవిత విద్యాభ్యాసం ప్రభుత్వ పాఠశాలలోనే సాగింది. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివారు. పదో తరగతిలో 9.7 జీపీఏతో ఉత్తీర్ణత సాధించి మండల స్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు. 2020లో బాసర ట్రిపుల్ ఐటీలో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. 9.32 సీజీపీఏ సాధించారు.

వారి కష్టానికి ఫలితం: కవిత

"మమ్మల్ని చదివించడానికి మా నాన్న అహర్నిశలూ కష్టపడ్డారు. వ్యవసాయంతోపాటు ఇతర పనులు కూడా చేశారు. ఆ కష్టం వృథా కాకూడదని, నాపై అమ్మానాన్న పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టాలని అనుకున్నాను. బాగా చదివి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో ముందుకు వెళ్లాను. ట్రాన్స్‌కోలో ఏఈగా ఉద్యోగం వచ్చినా... కచ్చితంగా సివిల్స్‌లో ఉద్యోగం సంపాదించాలనే ఉద్దేశంతోనే కోచింగ్‌కు వెళ్లాను. నాకు వచ్చిన మార్కులతో ఏ ఉద్యోగం వచ్చినా చేయడానికి సిద్ధపడ్డాను. ఇప్పుడు డీఎస్పీగా ఎంపికయ్యాను. ఎంతో ఆనందంగా ఉంది. నా కోసం అమ్మానాన్నలు పడ్డ కష్టానికి ఫలితం ఈ విజయం."

చిన్ననాటి కల...

2014లో పాఠశాల వార్షికోత్సవంలో కవిత ఉపన్యాసానికి... ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ బి.జనార్దన్‌రెడ్డి ముగ్ధులయ్యారు. 'పెద్దయ్యాక ఏమవుతావు' అని ఆయన అడిగితే... 'కలెక్టర్ అవుతా' అంటూ ఆమె సమాధానం చెప్పారు. అదే లక్ష్యంతో పట్టుదలగా చదివారు. సివిల్స్‌కు సన్నద్ధం అవుతున్న క్రమంలో టీజీ ట్రాన్స్‌కోలో ఏఈగా ఎంపికయ్యారు. వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలోని శ్రీరంగాపురం ఏఈగా పని చేశారు. అంతటితో ఆమె సంతృప్తి చెందలేదు. మళ్లీ గ్రూప్ వన్ కోసం ఎనిమిది నెలలు సెలవు పెట్టి తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందారు. చివరకు ఆమె కష్టం ఫలించింది. ఇటీవల విడుదల చేసిన గ్రూప్-1 ఫలితాల్లో 480వ ర్యాంకు (బీసీ-ఏ విభాగంలో పదో ర్యాంకు) సాధించారు. డీఎస్పీగా అర్హత పొందారు. తమ కూతురు డీఎస్పీగా ఎంపిక కావడం ఎంతో గర్వంగా ఉందంటూ ఆమె తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.



● నోముల రవీందర్‌రెడ్డి, మహబూబ్‌నగర్

దుర్గా నవరాత్రులు



నేటి అలంకారం

శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి

ఆశ్వయుజ శుద్ధ పంచమి, శనివారం

శరన్నవరాత్రి మహోత్సవాల్లో ఈ రోజు శ్రీ లలితా త్రిపురసుందరీదేవిగా విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ దర్శనమిస్తారు. త్రిపురాత్రయంలో లలితాదేవి రెండో శక్తి. దేవీ ఉపాసకులకు ఈ తల్లి ముఖ్యదేవత. త్రిగుణాతీతమైన కామేశ్వర స్వరూపం ఆమెది. లక్ష్మీ సరస్వతులు ఇరువైపులా ఉండి వింజామరలు వీస్తుండగా శ్రీచక్ర అధిష్ఠాన శక్తిగా ఆమె కొలువై ఉంటుంది. చెరుకుగడ, విల్లు, పాశాంకుశాలను ధరించి, శివుడి వక్షస్థలంపై కూర్చుని భక్తులకు వరాలిస్తుందనీ, పంచ, దశాక్షరీ మహా మంత్రాధి దేవతగా తనను కొలిచే భక్తుల్నీ, ఉపాసకుల్నీ అనుగ్రహిస్తుందనీ భక్తులు నమ్ముతారు. లలితాదేవి విద్యా స్వరూపిణి. సమస్త సుఖాలు ప్రసాదించే శక్తి స్వరూపిణి అనీ, మాంగల్య సౌభాగ్యాన్ని ప్రసాదిస్తుందనీ భక్తుల విశ్వాసం. లలితాదేవి అనుగ్రహం కోసం సువాసినీ పూజ చెయ్యాలనీ, వివిధ పూలతో, కుంకుమతో అర్చించాలనీ పురాణాలు పేర్కొంటున్నాయి. త్రిమూర్తులు, సకల దేవతలు ఆమెను కొలుస్తారనీ, ఆమెను ఆరాధించిన వారికి ఎల్లప్పుడూ సుఖ సౌఖ్యాలు కలుగుతాయనీ చెబుతున్నాయి.

నైవేద్యం :
అల్లం గారెలు, ఐదురకాల తీపి పదార్థాలు

అలంకరించే చీర రంగు :
బంగారు వర్ణం

అర్చించే పూల రంగు:
వివిధ రకాలు

పారాయణ చెయ్యాల్సినవి:
లలితా సహస్రనామం.




అమ్మవారికి 4.50కోట్లతో అలంకరణ

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి సన్నిధిలోని వాసవీమాతను శుక్రవారం రూ.4కోట్ల 50లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు.

- అమలాపురం, ఆంధ్రజ్యోతి





బెజవాడలో దసరా సందడి

బెజవాడలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఒకవైపు ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర స్వామివార్ల దర్శనానికి పోటెత్తుతున్న భక్తులు, మరోవైపు భక్తి, సాంస్కృతిక కార్యక్రమాల్లో విశేషంగా పాల్గొంటున్నారు. శుక్రవారం ఐదోరోజు దుర్గమ్మ శ్రీమహాలక్ష్మి రూపంలో భక్తులను అనుగ్రహించారు. సాయంత్రం దుర్గా ఘాట్ వద్ద కృష్ణా నవ హారతిని తిలకించడానికి వచ్చిన భక్తులు జయజయధ్వానాలతో ఆ ప్రాంతాన్ని మార్మోగించారు. బెజవాడలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఉత్సవ వేదికలు భక్తులతో కళకళలాడాయి. పున్నమి ఘాట్ వద్ద సాంస్కృతిక సంబరాలు అంబరాన్ని తాకాయి. భవానీ మాలధారుల ప్రత్యేక దాండియా కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. చిన్నాపెద్దా కలిసి సందడి చేశారు.

మైసూరును మరిపిస్తున్న 'విజయవాడ ఉత్సవ్'

- ప్రశంసించిన త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి
- ఉర్రూతలూగించిన బాలీవుడ్ గాయని అభిలిప్సా

విజయవాడ సిటీ/విజయవాడ కల్చరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): దేశ వారసత్వ సంపదను పండుగలు రక్షిస్తాయని త్రిపుర గవర్నర్ ఎన్. ఇంద్రసేనారెడ్డి అన్నారు. విజయవాడ పున్నమి ఘాట్‌లో జరుగుతున్న విజయవాడ ఉత్సవ్ కార్యక్రమాన్ని ఆయన సతీమణి రేణుకతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ మైసూరు ఉత్సవాలను మరిపించేలా విజయవాడ దసరా ఉత్సవాలు జరుగుతున్నాయని ప్రశంసించారు. రాజులు కట్టిన ఎన్నో కోటలు కాలగర్భంలో కలిసిపోయాయని, ఆధ్యాత్మిక చింతన పెంచే ఆలయాలు సుస్థిరంగా ఈ నేలపై నిలిచిపోయాయని చెప్పారు. సంస్కృతి సంప్రదాయాలను ఇలాంటి ఉత్సవాలు ప్రతిబింబిస్తాయని, ప్రజల్లో ఆధ్యాత్మిక భావనను పెంచుతాయని అన్నారు. విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకోవడం తన అదృష్టంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డిని ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు బొండా ఉమ, సుజనాచౌదరి, కామినేని శ్రీనివాస్, బుద్దా వెంకన్న తదితరులు ఘనంగా సత్కరించారు.



త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని సన్మానిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు బొండా ఉమా, సుజనాచౌదరి, కేశినేని శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ బుద్దా

ఉప్పొంగిన ఆధ్మాతికత

పున్నమి ఘాట్‌లో ఐదో రోజు శుక్రవారం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. బాలీవుడ్ గాయని అభిలిప్సా పాండా తన అద్భుత గాత్రంతో కృష్ణమ్మ ఒడిలో ఆధ్యాత్మికతను ఉప్పొంగించారు. గర్బా నైట్‌లో భాగంగా హిందీ పాటకు దాండియా బృందంతో నాట్యం చేయించారు. స్థానిక కళాకారులు మహిషాసుర సంహారాన్ని నృత్యరూపంలో కళ్లకు కట్టారు.

ఉత్సవ్‌లో నేటి కార్యక్రమాలు

శనివారం సాయంత్రం గొల్లపూడిలో విజయవాడ ఎగ్జిబిషన్‌ను సినీ హీరో, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రారంభిస్తారు. తర్వాత సింగర్ సునీల్ లైవ్ మ్యూజిక్ జరుగుతుంది. పున్నమి ఘాట్‌లో శాస్త్రీయ నృత్య ప్రదర్శన, డివోషనల్ లైవ్ కార్యక్రమం ఉంటుంది. తుమ్మలపల్లి కళాక్షేత్రం వేదికగా.. రాజమహేంద్రవరానికి చెందిన నాట్యాచారిణి డాక్టర్ లలిత సిందూరి శిష్య బృందంతో కూచిపూడి నృత్య ప్రదర్శన, సంగీత కచేరి, మ్యాజిక్ షో, వీరనాట్యం, తోలుబొమ్మలాట, సాంఘిక నాటకం తదితర కార్యక్రమాల ప్రదర్శన జరుగుతాయి. ఘంటసాల ప్రభుత్వ కళాశాలలో.. ఆంధ్రనాట్యం, సంగీత కచేరి, కూచిపూడి నృత్య ప్రదర్శన, బుర్రకథ, తోలుబొమ్మలాట, పౌరాణిక పద్య నాటకం శ్రీకృష్ణ తులాభారం తదితర కార్యక్రమాలు ప్రదర్శిస్తారు.

చిత్రజ్యోతి ★ SINCE 1965 ★

దర్శకుడు వైవీఎస్ చౌదరికి మాతృవియోగం



దర్శకుడు, నిర్మాత వైవీఎస్ చౌదరి మాతృమూర్తి రత్నకుమారి (88) కన్నుమూశారు. గురువారం రాత్రి ఆవిడ తుది శ్వాస విడిచినట్లు దర్శకుడు చౌదరి తెలిపారు. 'లారీ డ్రైవర్ అయిన మా నాన్న యలమంచిలి నారాయణ రావు సంపాదనతో మా అమ్మ మమ్మల్ని పెంచి పెద్ద చేశారు. పనిమనిషి ప్రమేయం లేని జీవితాన్ని మాకు అందించాలనే తపనతో ప్రతి రోజూ తెల్లారే లేచి అన్నీ తానే చేసేవారు. మమ్మల్ని పెంచడానికి తన జీవితాన్ని అంకితం చేశారు. మా అవసరాలకు తగ్గట్లుగా తన నోటి లెక్కలతోనే బడ్జెట్ కేటాయించిన ఆర్థిక రంగ నిపుణురాలు మా అమ్మ. ఆవిడకు తెలిసిన లెక్కలు, మమ్మల్ని పెంచిన విధానం ఏ చదువు, ఏ విద్యా నేర్పించలేనివి. తన విధానాలతో మాలో కూడా స్ఫూర్తిని నింపిన మహనీయురాలు మా అమ్మ' అంటూ నివాళులు అర్పించారు వైవీఎస్ చౌదరి.

సంక్రాంతికి వినోదాల విందు



తనదైన కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న నవీన్ పొలిశెట్టి మరో కుటుంబ కథా చిత్రం 'అనగనగా ఒక రాజు'తో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. మారి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి కథానాయిక. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బేనర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. సంక్రాంతికి కానుకగా 2026 జనవరి 14న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. తాజాగా ఈ చిత్ర టీజర్‌ని యూనిట్ విడుదల చేసింది. బంగారు ఆభరణాల ప్రకటనతో టీజర్ ప్రారంభమౌతుంది. సినిమా ప్రోమోలో భాగంగా ఒంటి నిండా ఆభరణాలు ధరించిన మీనాక్షి చౌదరి, తమ సినిమాకు బదులు ఆభరణాల గురించి మాట్లాడుతుంది. దాంతో నవీన్ పొలిశెట్టి ఆమె ఆభరణాలను తాను ధరించి 'అనగనగ ఒక రాజు' సినిమా సంక్రాంతికి వస్తోంది అని చెప్పడం సరదాగా ఉంది. టీజర్‌లో నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి పోటీ పడుతూ నవ్వులు పంచారు. ఈ చిత్రానికి డీవోపీ: జె.యువరాజ్, సంగీత దర్శకుడు: మిక్కీ జె.మేయర్.

మరోసారి భయపెట్టనున్న నవాజుద్దీన్



ఆయుష్మాన్ ఖురానా, రష్మిక మందన్న జంటగా ఆదిత్య సర్పోత్‌దార్ తెరకెక్కించిన రొమాంటిక్ హారర్ కామెడీ చిత్రం 'థామ్మా'. మడాక్ ఫిల్మ్స్ బేనర్‌పై దినేశ్ విజన్, అమర్ కౌశిక్ నిర్మిస్తున్నారు. మడాక్ హారర్ కామెడీ యూనివర్స్‌లో భాగంగా ఇప్పటికే వచ్చిన 'స్త్రీ', 'ముంజ్యా', 'భేదియా', 'స్త్రీ 2' చిత్రాలు ప్రేక్షకులను మెప్పించాయి. ఇప్పుడు అదే కోవలో 'థామ్మా' వస్తోంది. దీపావళి సందర్భంగా అక్టోబరు 21న థియేటర్లలో సందడి చేయనుంది. తాజాగా యూనిట్ ఈ చిత్రం ట్రైలర్‌ని విడుదల చేసింది. 'యక్షాసన్' అనే బేతాళుడి పాత్రలో నవాజుద్దీన్ సిద్ధిఖి కట్టి పడేశారు. మరోసారి ప్రేక్షకులను నవాజుద్దీన్ తన భీకర నటనతో భయపెట్టబోతున్నట్లు ట్రైలర్‌ని చూస్తే అర్థమవుతోంది.

'దృశ్యం 3' సెట్‌లో మోహన్‌లాల్‌కు సత్కారం



ప్రతిష్ఠాత్మక దాదాసాహెబ్ పురస్కారం అందుకొన్న మలయాళ చిత్రరంగ సూపర్ స్టార్ మోహన్‌లాల్‌కు శుక్రవారం 'దృశ్యం 3' చిత్రం సెట్‌లో సాదర స్వాగతం లభించింది. ఆ చిత్రంలో మోహన్‌లాల్‌కు భార్యగా నటిస్తున్న మీనా, దర్శకుడు జీతూ జోసెఫ్ అభినందనలు తెలిపి, కేక్ కట్ చేయించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను మీనా సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

'అవతార్ 3' విడుదలకు సిద్ధం



హాలీవుడ్ స్టార్ డైరెక్టర్ జేమ్స్ కామెరూన్ తెరకెక్కించిన అద్భుత ప్రపంచం 'అవతార్' సంచలన విజయాలు నమోదు చేసిన విషయం విదితమే. హాలీవుడ్ రూపురేఖలనే మార్చేసిన ఈ అవతార్ యూనివర్స్‌లో ఇప్పటికే రెండు భాగాలు విడుదలై ప్రేక్షకులను మెప్పించాయి. ఇప్పుడు మూడో భాగం 'అవతార్: ఫైర్ అండ్ యాష్' డిసెంబరు 19న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. రెండు నెలల క్రితమే ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. తాజాగా మరో కొత్త ట్రైలర్‌ని విడుదల చేసింది. ఇందులో పోరాట ఘట్టాలు కట్టిపడేసేలా ఉన్నాయి. రెండు తెగల మధ్య జరిగిన యుద్ధాన్ని దర్శకుడు అద్భుతంగా ఆవిష్కరించారు. అలాగే పండోరాకు చెందిన అద్భుతమైన నీటి అడుగు ప్రపంచాన్ని మరోసారి ప్రేక్షకులకు అందించనుంది.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కళల కాణాచి ప్రతినిధులు

నేటి నుంచి వీణా అవార్డ్స్ జాతీయ స్థాయి నాటికల పోటీలు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వీణా అవార్డ్స్ జాతీయ స్థాయి పద్య నాటక, సాంఘిక నాటకం, నాటికల పోటీలు శనివారం ప్రారంభమవుతాయని కళల కాణాచి అధ్యక్షుడు, సినీ రచయిత బుర్రా సాయిమాధవ్ తెలిపారు. సీపీఐ కార్యాలయంలో శుక్రవారం బ్రోచర్‌ను విడుదల చేశారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో మూడు విభాగాల్లో పోటీలు జరుగుతాయని, 9 పద్య నాటకాలు, ఐదు సాంఘిక నాటకాలు, ఏడు సాంఘిక నాటికలు అక్టోబరు 2 వరకు ప్రదర్శిస్తామన్నారు. ప్రవాస భారతీయుడు డాక్టర్ ఆర్ బాబు వడ్లమూడి పోటీల నిర్వహణకు సహకారం అందించారని చెప్పారు. దసరా సంబరాలతో పాటు కళాభిమానులకు ఆరు రోజులు రంగస్థల పండుగ కనువిందు చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వేమూరి విజయభాస్కర్, తాడిబోయిన హరిప్రసాద్, చెరుకుమల్లి సింగారావు, బెల్లంకొండ వెంకట్, హకీంజాని, మల్లేశ్వరరావు, రామలింగేశ్వరరావు, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మకు ఘన నివాళి

తెనాలి అర్బన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రజక చెరువు పార్కులో చాకలి ఐలమ్మ జయంతి శుక్రవారం నిర్వహించారు. ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు ఫణిదపు దుర్గ మాట్లాడుతూ, తెలంగాణ వీరవనితగా భూపోరాటం చేశారని, రైతాంగ ఉద్యమాల్లో పాల్గొని పేదల అభ్యున్నతికి పాటు పడ్డారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ ఖుద్దూస్, పసుపులేటి త్రిమూర్తి, జొన్నాదుల మహేష్, అత్తోట శరత్, సుభాని, రాము, పినపాటి రవీంద్ర, అశోకవర్ధన, దుర్గాప్రసాద్, విజయేంద్ర, లక్ష్మీపతిరావు పాల్గొన్నారు.



ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

● రజక చెరువు పార్కులోని చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద వైసీపీ నేతలు నివాళులర్పించారు. ఐలమ్మ జయంతి పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు పెదలంక వెంకటేశ్వరరావు, బాజీ, వెంకటకృష్ణ, క్రాంతి, అక్కిదాసు కిరణ్, కాళిదాసు సత్యం తదితరులు పాల్గొన్నారు.

● పొన్నూరుటౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ మహిళలకు స్ఫూర్తి ప్రదాత అని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య పట్టణ అధ్యక్షురాలు రావూరి సుగుణ అన్నారు. పట్టణంలోని 25వ వార్డు ఇందిరా గిరిజన కాలనీలో శుక్రవారం తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు, చంచమ్మ, కోటేశ్వరమ్మ, పోలమ్మ, పద్మ, కోటేశ్వరమ్మ, రమణ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రతతో అంటువ్యాధుల నివారణ

తెనాలి అర్బన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పరిసరాలు శుభ్రంగా ఉంటే అంటు వ్యాధులు ప్రబలవని కౌన్సిలర్ షేక్ ఇస్మాయిల్ చెప్పారు. పట్టణంలోని పినపాడులో శుక్రవారం డ్రై డే పురస్కరించుకుని ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఇంటితో పాటు పరిసరాలు కూడా శుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వ లేకుండా చూడాలని చెప్పారు. రోజుల తరబడి నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందుతాయని, తద్వారా పలు వ్యాధులు వ్యాప్తి చెందుతాయని చెప్పారు. జ్వరాలు వచ్చిన వెంటనే స్థానిక వైద్యులు కాకుండా మంచి వైద్యం పొందాలన్నారు. మలేరియా అధికారి ప్రభాకరరెడ్డి, డాక్టర్ మనోజ్‌బాబు, డాక్టర్ సంయుక్త, ఉమాకాంత్, బాలచంద్రమౌళి, పున్నారెడ్డి పాల్గొన్నారు.



పారిశుధ్య కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కౌన్సిలర్ ఇస్మాయిల్

వైద్య రంగంలో డాక్టర్ అమీర్ ఎనలేని వైద్య సేవలు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వైద్య రంగంలో డాక్టర్ సయ్యద్ అమీర్ ఎనలేని సేవలు అందించారని ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ కె.అనీల్‌కుమార్ చెప్పారు. బోసురోడ్డులోని ఐఎంఏ హాలులో శుక్రవారం మత్తు వైద్య నిపుణులు అమీర్ సంస్మరణ సభ నిర్వహించారు. శస్త్ర చికిత్సలలో రోగులకు మత్తు అవసరమని, కొన్నిసార్లు అత్యవసర పరిస్థితులు తలెత్తేవని, వాటిని చక్కగా ఎదుర్కొనే సత్తా కలిగి ఉన్నారని చెప్పారు. వైద్యులు చందు సాంబశివుడు, హనుమంతరావు, విజయలక్ష్మి, మద్దు ప్రభాకర్, శ్యాంప్రసాద్, శేషగిరిరావు, కోటేశ్వరప్రసాద్, రియాజ్‌ఖాన్ పాల్గొన్నారు.



డాక్టర్ అమీర్‌కు నివాళులర్పిస్తున్న వైద్యులు

విద్యార్థులకు ఉపాధి కల్పించేందుకు వృత్తి విద్యా కోర్సులు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు ఉపాధి కల్పించేందుకు వృత్తి విద్యా కోర్సులు దోహదపడతాయని ప్రధానోపాధ్యాయుడు కుర్రా శ్రీనివాసరావు చెప్పారు. సుల్తానాబాద్‌లోని కార్ కేర్ సెంటర్‌లో యడ్లపల్లి హైస్కూల్ విద్యార్థులకు శుక్రవారం ఆటోమొటివ్ ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఉన్నత పాఠశాలల్లో టీఎంసీ పథకం ప్రవేశ పెట్టి ఒకేషనల్ ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు వృత్తి విద్యపై అవగాహన, శిక్షణ అందిస్తుందన్నారు. నాలుగు చక్రాల వాహనాల్లో ఉండే విభాగాలు, పని తీరు, తదితర అంశాలను నిపుణులు వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్ తిరుపతిరావు, గుడిపూడి అశోక్ విద్యార్థులకు అవగాహన కల్పించారు.



కారు విభాగాలను పరిశీలిస్తున్న విద్యార్థులు

కనకదుర్గమ్మకి ధనలక్ష్మి అలంకారం

● మారీసుపేటలో రూ.80 లక్షల నగదు అలంకరణ



తెనాలి మారీసుపేట చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో రూ.80 లక్షలతో ధనలక్ష్మి అలంకారం



నందులపేటలో రూ.40 లక్షలతో అమ్మవారికి చేసిన అలంకారం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆలయాలలో దసరా నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని అమ్మవారు శుక్రవారం ధనలక్ష్మిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మారీసుపేటలోని శ్రీచంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి రూ.80 లక్షల నగదుతో అలంకరించారు. వాసవీ ఆలయంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారిని రూ.15 లక్షలతో అలంకరించారు. రామలింగేశ్వరపేట శివాలయం, మారీసుపేట అప్పలస్వామి ఆలయం, దేవీచౌక్‌లో రాజరాజేశ్వరి ఆలయం, శివాజీచౌక్‌లో కాళీమాత ఆలయం, కొత్తపేటలో అష్టలక్ష్మి ఆలయం, పాత శివాలయం, బాలత్రిపురసుందరి దేవి ఆలయం, చినరావూరు సోమేశ్వరాలయంలో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. పట్టణంలోని నందులపేటలో అమ్మవారికి రూ.40 లక్షల నగదుతో ధనలక్ష్మి అలంకారం చేశారు. వజ్రాల వారి వీధిలో షిరిడి సాయి అనుగ్రహ పీఠంలో అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

● పొన్నూరు టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సిరులు ఇచ్చే శ్రీ మహాలక్ష్మిగా అమ్మవారు అభయం ఇచ్చారు. దేవి శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా శుక్రవారం ఆలయాల్లో కొలువుదీరిన అమ్మవారు శ్రీ మహాలక్ష్మి అలంకారంలో భక్తులను అలరించారు. పట్టణ శివారులోని జీబీసీ రోడ్డులో ఉన్న శ్రీ కనకదుర్గ భవాని ఆలయంలో శ్రీ మహాలక్ష్మి దేవి అలంకారంలో కొలువుదీరిన అమ్మవారిని పూజించేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా సామూహిక కుంకుమార్చన జరిగింది. అలాగే సహస్రలింగేశ్వర స్వామి ఆలయంలోని పార్వతీదేవి, కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలోని విశాలాక్షమ్మ, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి, శ్రీ తోటమ్మ తల్లి, నిడుబ్రోలు శ్రీ రాజరాజేశ్వరి దేవి, చింతలపూడి భ్రమరాంబ దేవి తదితర అమ్మవార్లు శ్రీ మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. లక్ష్మీదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.



లక్ష్మీదేవి అలంకారంలో దర్శనమిస్తున్న కనకదుర్గ భవాని అమ్మవారు

● పెదకాకాని, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో భ్రమరాంబ అమ్మవారు 5వ రోజు శుక్రవారం మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో దసరా ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు.



పెదకాకానిలో విశేష అలంకారంలో భ్రమరాంబ అమ్మవారు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట గల శ్రీ దశావతార వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో ఉన్న శ్రీ మహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో ఐదవ రోజు శుక్రవారం అమ్మవారు ధాన్యలక్ష్మి అలంకారంతో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయంలో జరిగే భక్తి కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి అనుగ్రహం పొందాలని ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణ భాస్కరరావు దంపతులు భక్తులకు విజ్ఞప్తి చేశారు.

● కొల్లిపర, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆలయాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం కన్నుల పండువగా నిర్వహించారు. మండల కేంద్రం కొల్లిపరలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ జనార్ధనస్వామి ఆలయంలో శ్రీమహాలక్ష్మీదేవి, శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో శ్రీ సంతానలక్ష్మీదేవిగా, ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పండితులు అమ్మవారిని శ్రీ మహాలక్ష్మీదేవిగా అలంకరించి సుందరంగా తీర్చిదిద్దారు. అదేవిధంగా మండలంలోని వల్లభాపురం, మున్నంగి, పిడపర్రు, తూములూరు, హనుమాన్‌పాలెం, అన్నవరం, చివలూరు గ్రామాల్లోని శివాలయాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరణ చేయడంతో భక్తులు పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించారు.



కొల్లిపర సాయిబాబా మందిరంలో శ్రీ సంతానలక్ష్మీదేవి అలంకరణ

● చేబ్రోలు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : చేబ్రోలులోని కూరగాయల మార్కెట్ దగ్గర ఏర్పాటు చేసిన మండపంలో శుక్రవారం అమ్మవారిని లక్ష్మీదేవిగా అలంకరించారు. అమ్మవారిని రూ.25 లక్షల నగదు నోట్లుతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించగా, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శనం చేసుకున్నారు.



రూ.25 లక్షలతో అమ్మవారి అలంకరణ

వీరరాఘవాచార్యుల జయంతి

తెనాలి అర్బన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శాఖా గ్రంథాలయంలో డాక్టర్ కొండూరి వీరరాఘవాచార్యుల 113వ జయంతి శుక్రవారం నిర్వహించారు. ఆయన పేరిట ఇస్తున్న పురస్కారాన్ని చిత్రకారుడు రావూరి సుభాష్‌బాబుకు ప్రదానం చేశారు. అప్పారావు స్వాగతం పలికిన సభలో అయినాల మల్లేశ్వరరావు అధ్యక్షతన శాశ్వత సభ్యుడు కాటూరి వెంకటేశ్వరరావు పలువురు సాహిత్యవేత్తలు పాల్గొన్నారు.

అలరిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : దసరా ఉత్సవాల్లో ప్రదర్శిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరిస్తున్నాయి. శివాజీచౌక్‌లో కాళీమాత మందిరం వద్ద నిర్వహిస్తున్న ఉత్సవాల్లో శుక్రవారం రాత్రి కూచిపూడి నృత్యగురువు రంగనాయకిని ఘనంగా సన్మానించారు. కూచిపూడి నృత్యంలో ఎంతోమంది బాలికలకు శిక్షణ ఇస్తున్న ఆమెను అభినందించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ గుమ్మడి రమేష్, కార్యదర్శి శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు అనంతాచార్యులు, కఠారి వాసుదేవనాయుడు పాల్గొన్నారు. బోసురోడ్డులోని శ్రీవాసవీ ఆలయంలో వెంకటలక్ష్మి బృందం కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. దేవీచౌక్‌లో శ్రీవేంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందం భక్తిరంజని ఆలపించారు. మారీసుపేట శివాలయంలో కూచిపూడి నాట్యాలయం బాలికలు కూచిపూడి నృత్యం ప్రదర్శించారు.



కూచిపూడి నాట్యగురువు రంగనాయకిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

నేడు మెగా జాబ్‌మేళా

తెనాలి అర్బన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాలలో శనివారం మెగా జాబ్‌మేళా జరుగుతుందని కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్ తెలిపారు. పది, ఇంటర్, ఐటీఐ చదివిన విద్యార్థులు తమ సర్టిఫికెట్లతో మేళాకు హాజరుకావాలని కోరారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాలో 20 కంపెనీలు అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేస్తాయని, ఈ కంపెనీలలో 700లకు పైగా ఉద్యోగాలు ఉన్నాయని తెలిపారు.

సోమేశ్వరాలయంలో గణపతికి వెండి ఆభరణాలు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : చినరావూరు సోమేశ్వరాలయంలో భక్తులు గణపతికి వెండి ఆభరణాలు సమర్పించారు. 629 గ్రాముల తొండం, నామాలు శుక్రవారం ఈవో హరిప్రసాద్, అర్చకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గొల్లపూడి అప్పారావు, వెంకటేశ్వరరావు, శివలింగప్రసాద్, నాగేశ్వరరావు, అశోక్ బాబు, సులోచన పాల్గొన్నారు.



వెండి ఆభరణాలు అందజేస్తున్న భక్తులు

వేద ధర్మ పరిరక్షణకు పరిషత్ కృషి

తెనాలి అర్బన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వేద ధర్మ పరిరక్షణకు బ్రాహ్మణ పరిషత్ కృషి చేస్తుందని అధ్యక్షుడు కె.పార్థసారధి చెప్పారు. కొత్తపేటలోని పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం వేద సభ నిర్వహించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో పరిషత్ ముందుంటుందన్నారు. సభ్యులు, దాతల సహకారంతో సంఘ శ్రేయస్సుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అంజనేయ చయనులు, జగన్నాథం, శ్రీకృష్ణ, సత్యనారాయణ అవధాని, సాయికిరణ్, శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జేఎంజే కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సాయిమంగా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కె.రమేష్, ప్రిన్సిపల్ శాంత, వైస్ ప్రిన్సిపల్ రేజిలీనా, సుధాకర్, రామకృష్ణారెడ్డి, ప్రసాద్, మార్కండేయులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

చేబ్రోలు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : చేబ్రోలు పరిసర ప్రాంతమైన శలపాడులోని శ్రీనివాస ట్యూషన్ సెంటర్‌లో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆ సంస్థ డైరెక్టర్ శ్రీనివాసరావు ఏర్పాటు చేశారు. కామాక్షి ఐ కేర్ అండ్ ఆప్టికల్స్, చెరుకుపల్లి వారి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి.వాసుదేవరావు, డాక్టర్. డి.వెంకటేశ్వరమ్మ కంటి పరీక్షలు చేసి తదనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

వడ్లమూడిలో అమ్మవారి శతజయంతి ఉత్సవాలు

చేబ్రోలు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : చేబ్రోలు మండలం వడ్లమూడి గౌడపాలెంలో మహాలక్ష్మి అమ్మవారి శతజయంతి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. గ్రామ ప్రజలందరూ ఏకతాటిపై చేరుకుని అమ్మవారికి పసుపు,కుంకుమలతో సారె సమర్పించారు. మేళతాళాలతో స్థానికులు ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

మణికంఠ కుటుంబానికి న్యాయం చేయాలి : ఏఐఎస్ఎఫ్

ఏఎన్‌యూ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థి మణికంఠ మృతికి అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఏఎన్‌యూలో విద్యార్థి మణికంఠ చిత్రపటానికి నివాళులర్పించి ర్యాలీతో నిరసన వ్యక్తం చేశారు. ఆంధ్ర యూనివర్సిటీ ఉపకులపతి వెంటనే రాజీనామా చేయాలని కోరారు. కనీస మెడికల్ వసతులులేని వర్సిటీ దేనికి అని ప్రశ్నించారు. ఆక్సిజన్, అంబులెన్సు లేని వర్సిటీపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. మణికంఠ కుటుంబానికి తక్షణమే న్యాయం చేయాలన్నారు. విద్యార్థుల ప్రాణాలతో వీసీ ఆటలాడుతున్నారన్నారు. ఇలాంటి ప్రాణ నష్టాలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. వీసీ నిర్లక్ష్య ధోరణి కారణంగానే ఈ మరణం సంభవించిందని ఆరోపిస్తూ న్యాయం జరిగే వరకు ఈ పోరాటం ఆగదు అని అన్నారు.



చేప పిల్లలను పరిశీలిస్తున్న జిల్లా మత్స్యశాఖ అధికారి కిరణ్ కుమార్ తదితరులు

మత్స్య సంపద అభివృద్ధికి కృషి

● జిల్లా అధికారి కిరణ్ కుమార్

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మత్స్య సంపద అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామని ఆ శాఖ అధికారి పీఎస్ కిరణ్ కుమార్ అన్నారు. నిడుబ్రోలు మత్స్య క్షేత్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తొట్టిలో పెంచుతున్న స్పాన్ చేప పిల్లలను పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో కిరణ్ కుమార్ మాట్లాడుతూ మత్స్య క్షేత్రంలోని 45 తొట్టిల్లో సుమారు 62 లక్షల చిరు చేప పిల్లలను పెంచుతున్నట్లు చెప్పారు. చిరు చేప పిల్లలు పెరిగిన తరువాత నవంబరు 21న మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకొని జలాశయాల్లో విడుదల చేయనున్నట్లు చెప్పారు. మత్స్య క్షేత్రం సమీపంలో ఉన్న ల్యాబ్‌లు పరిశీలించి నీటి నమూనాల పరీక్ష తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మత్స్య శాఖ అభివృద్ధి అధికారి మహమ్మద్ జైలుల్లా ఖాన్, పీఎఫ్‌వో శ్యామ్ పాల్గొన్నారు.

వీవీఐటీయూలో ముగిసిన ఇన్నోవా హ్యాక్ 2కే25 హ్యాక్ థాన్

పెదకాకాని, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్శిటీలో (ఐయూసిఈఈ) ఇండో యూనివర్శల్ కొలాబరేషన్ ఫర్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఈనెల 25, 26 తేదీలలో 24 గంటలు నిర్విరామంగా నిర్వహించిన 'ఇన్నోవా హ్యాక్ 2కె25' జాతీయస్థాయి హ్యాక్ థాన్ శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అమెరికాకు చెందిన నార్తన్ ఐయోవా స్టేట్ యూనివర్శిటీ ప్రొఫెసర్ పి.నాగేశ్వరరావు, వీవీఐటీయూ రిజిస్ట్రార్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి హాజరై విజేతలకు బహుమతులు అందించారు. 14 కళాశాలలకు చెందిన 361 మంది విద్యార్థినీ, విద్యార్థులు 52 బృందాలుగా ఈ ఇన్నోవా హ్యాక్ థాన్‌లో పాల్గొన్నారు. ఈ హ్యాకథాన్‌లో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ సాంకేతికతో భూసారం, తేమ మోతాదును తెలుసుకునే విధంగా నమూనా రూపొందించిన డీబగ్ థగ్స్ బృందం మొదటి బహుమతి గెలుపొందింది. ప్రొఫెసర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆలోచనలను ఆవిష్కరించడానికి, సాంకేతిక సవాళ్ల పరిష్కారానికి ఇటువంటి హాక్ థాన్లు మంచి వేదికలని అన్నారు. కార్యక్రమంలో వీవీఐటీయూ డైరెక్టర్ రావెల నవీన్, హ్యాకథాన్ సమన్వయకర్త వివేక్, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రదానం చేస్తున్న అధ్యాపకులు

నైపుణ్యాలు సాధించే విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నైపుణ్యాలు సాధించే విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎన్నారై డిగ్రీ కళాశాల సీఈవో ఉమామహేశ్వరరావు చెప్పారు. కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్‌డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, విద్యతో పాటు తమకు ఆసక్తి ఉన్న రంగంలో రాణించేందుకు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉన్నతికి ఉపయోగించుకోవాలని, సెల్‌ఫోన్‌తో కాలం గడిపితే మంచి భవిష్యత్ ఉండదని గుర్తించాలన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ లాజరుబాబు, శివన్నారాయణ, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న సీఈవో ఉమామహేశ్వరరావు

శుభ్రత, నాణ్యత పాటించాలి

● మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ యేసుబాబు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని హోటల్స్‌లో, ఆహార పదార్థాలు విక్రయించే దుకాణాలు, టిఫిన్లు అమ్మే తోపుడు బండ్ల నిర్వాహకులు శుభ్రత, నాణ్యత పాటించాలని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ మొవ్వా యేసుబాబు కోరారు. గంగానమ్మపేటలోని పలు దుకాణాలను శుక్రవారం ఆయన పరిశీలించి సూచనలు చేశారు. వాతావరణ మార్పుల కారణంగా వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని, ఆహార పదార్థాల తయారీలో నాణ్యత పాటించకుంటే డయేరియా వ్యాపిస్తుందని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. నాల్గవ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం పరిశీలించి కార్మికుల హాజరు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్ రాంప్రసాద్, అనుపమ, చింపిరయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

చిన్నారిపై వీధికుక్కల దాడి

కాకుమాను, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అప్పాపురంలో ఆడుకుంటున్న చిన్నారిపై శుక్రవారం సాయంత్రం వీధికుక్కల దాడి జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన షేక్ ఆసిఫ్(7) కొండపాటూరుకు వెళ్లే దారిలో ఆడుకుంటున్న సమయంలో అటుగా వెళుతున్న ఓ కుక్క బాలుడి ఛాతీపై కరిచి గాయపరిచింది. స్థానికులు పెద్దగా కేకలు వేయడంతో అక్కడ నుంచి వెళ్లిపోయింది. చిన్నారి కుటుంబ సభ్యులు కాకుమానులోని పీహెచ్‌సీలో వ్యాక్సిన్ వేయించారు. గ్రామంలో పెరిగిన వీధిక్కుల నుంచి రక్షణ కల్పించాలని స్థానికులు పంచాయతీ అధికారులు, ప్రజా ప్రతినిధులను వేడుకుంటున్నారు.

ముప్పాళ్లకు అభినందనలు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జాతీయ సమితి సభ్యుడిగా ఎన్నికైన ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావుకు మంగళగిరి నియోజకవర్గ సీపీఐ నేతలు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సీపీఐ నేతలు యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కంచర్ల కాశయ్య, అన్నవరపు ప్రభాకర్‌రావు, జాలాది జాన్‌బాబు పాల్గొన్నారు.

బ్యానర్ల చించివేతపై ఫిర్యాదు

మంగళగిరి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల సందర్భంగా మంగళగిరి పార్కు రోడ్డు వద్ద ఏర్పాటుచేసిన రెండు ఫ్లెక్సీ బ్యానర్లను గుర్తుతెలియని వ్యక్తులు చించివేశారు. ఈ ఘటనపై నూతకబత్తిన పూర్ణ భవానీ ప్రసాద్ అనే వ్యక్తి మంగళగిరి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీహరి తెలిపారు.

దాడిపై కేసు నమోదు చేయరూ...

దుగ్గిరాల, సెప్టెంబరు 26: తనపై దాడిచేశారని, పోలీసులకు ఫిర్యాదు చేసి నెలరోజులైనా కేసు నమోదు చేయడంలేదంటూ దుగ్గిరాల సుగాలనీ కాలనీకి చెందిన కేతావత్ దుర్గానాయక్ వాపోయాడు. ఆగస్టు 25న బంధువు అంత్యక్రియలకు వెళ్లి తిరిగి వస్తుండగా కాలనీకి చెందిన నలుగురు తనపై అకారణంగా దాడి చేయగా ఫిర్యాదు చేశానన్నాడు.



మంగళగిరిలో లలితా త్రిపురసుందరీ దేవిగా కనకదుర్గమ్మ, ఆదిలక్ష్మిగా రాజ్యలక్ష్మీ అమ్మవారు



కాకుమానులో రూ.5లక్షలతో మహాలక్ష్మీదేవిగా శ్రీభువనేశ్వరిదేవి, ప్రత్తిపాడు వేణుగోపాలస్వామి ఆలయంలో లలితాదేవి అలంకారం



శ్రీగౌరీదేవి అలంకారంలో కేఆర్‌కొండూరు శ్రీమహంకాళీఅమ్మవారు

జయహే జగన్మాత!

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం పలు ఆలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. పాత మంగళగిరి దుర్గానగర్‌లో శ్రీ కనకదుర్గ అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవిగా అలరించారు. స్టేషన్ రోడ్డులోని శ్రీ అఖిలాండేశ్వరీ అమ్మవారు శ్రీ మహాలక్ష్మీగా, ఎర్రచెరువు వద్ద కాళీమాత అమ్మవారిని శ్రీ మహాలక్ష్మీగా అలంకరించారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. నృసింహాలయంలో శ్రీరాజ్యలక్ష్మీ అమ్మవారు, ఘాట్ రోడ్డులో శ్రీపద్మావతి అమ్మవారు ఆదిలక్ష్మీగాను, శివాలయంలో శ్రీగంగా భ్రమరాంబిక అమ్మవారు రాజరాజేశ్వరీ దేవిగాను, మెయిన్ బజారులోని శ్రీ కన్యకా పరమేశ్వరి శ్రీగాయత్రి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

● కాకుమాను: మండల పరిధిలోని శ్రీభువనేశ్వరిదేవి ఆలయంలో ఐదో రోజు శ్రీభువనేశ్వరిదేవి అమ్మవారిని రూ. 5 లక్షల రూపాయలతో మహాలక్ష్మీగా అలంకరించారు. మండల పరిధిలోని కొండపాటూరు స్వయంభు శ్రీ పోలేరమ్మతల్లి ఆలయం, కాకుమానులో గంగా పార్వతి సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయం ప్రత్యేక అలంకారాలలో భక్తులకు దర్శనమిచ్చారు.

● ప్రత్తిపాడు: ప్రత్తిపాడులోని సుప్రసిద్ధ వేణుగోపాల స్వామి దేవాయలంలో లలితాదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే దాసరిపాలెంలోని పంచముఖి గాయత్రి దేవాలయంలో అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శన మిచ్చారు.

● వట్టిచెరుకూరు: మండల కేంద్రం వట్టిచెరుకూరులోని గంగా భ్రమరాంబిక సమేత బ్రహ్మేశ్వర స్వామి ఆలయం, అనంతవరప్పాడు మల్లేశ్వర స్వామి ఆలయం, ముట్లూరు చెన్నకేశవస్వామి ఆలయం, లేమల్లెపాడు పోలేరమ్మ అమ్మవారి ఆలయం, అనంతవరప్పాడులో కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవార్లు మహాలక్ష్మీ అలంకారంలో దర్శనమిచ్చారు.

● దుగ్గిరాల: మండలంలోని కేఆర్‌కొండూరు శ్రీమహంకాళీ అమ్మవారు శ్రీగౌరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దుగ్గిరాల శ్రీగంగాపార్వతీసమేత శ్రీనాగేశ్వరస్వామివారి ఆలయంలో, కేఆర్‌కొండూరు శ్రీమహంకాళీఅమ్మవారి ఆలయంలో శ్రీధనలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. మహంకాళీ ఆలయంలో శ్రీచండీహోమం కొనసాగించారు. ఈవో కోగంటి సునీల్‌కుమార్, ఫౌండర్‌ట్రస్టీ దేవాభక్తుని రంగప్రసాద్ ఆలయ సిబ్బంది భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● తాడికొండ: మండలంలోని నిడుముక్కలలోని శ్రీ గంగా పార్వతి సమేత సోమేశ్వర స్వామి దేవస్థానంలో మహాలక్ష్మీదేవి అమ్మవారిని రూ.2 లక్షలతో, బడేపురంలోని శ్రీ గంగాపార్వతీ సమేత శ్రీ ఓంకారేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారిని రూ.3,00,116 లక్షల నగదుతో ధనలక్ష్మీ అలంకారం చేశారు. తాడికొండ పడమర వీధి భవానీ ఆధ్యాత్మిక మండలి ఆధ్వర్యంలో లలీతాదేవి రూపంలో అలంకారం చేశారు.



నిడుముక్కలలో రూ.రెండు లక్షలతో, బడేపురంలో రూ. 3 లక్షలతో ధనలక్ష్మీ అలంకారంలో అమ్మవారు



కాళీమాత ఆలయంలో మహిళల కుంకుమార్చనలు

ఓటీపీ విధానంతో ప్రజల ఆస్తులకు భద్రత

● ఏపీ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపుల శాఖ కమిషనర్ అంబేద్కర్



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులతో మాట్లాడుతున్న అంబేద్కర్

మంగళగిరి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో ప్రవేశపెట్టిన ఓటీపీ విధానంతో ప్రజల ఆస్తులకు భద్రత ఏర్పడుతుందని, నకిలీ రిజిస్ట్రేషన్లకు అడ్డుకట్ట పడుతుందని ఏపీ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపుల శాఖ కమిషనర్, ఇన్‌స్పెక్టర్ జనరల్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అన్నారు. మంగళగిరి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలించారు. పలు రికార్డులను తనిఖీ చేసి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, జిల్లా రిజిస్ట్రార్ శైలజ, విజయవాడ డీఐజీ రవీంద్ర, మంగళగిరి సబ్‌రిజిస్ట్రార్ బాలగురవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇప్పటం వద్ద వ్యక్తి అనుమానాస్పద మృతి

తాడేపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం ఇప్పటం గ్రామాల మధ్య ఉన్న పంట కాలువలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. తాడేపల్లి ఎస్ఐ ఖాజావలి కథనం ప్రకారం తాడేపల్లి ఆర్ఎంఎస్ కాలనీకి చెందిన సాల్మన్‌రాజు (60) స్నేహితులు ఆరుగురితో కలిసి ఈ నెల 25న బకింగ్ హామ్ కెనాల్‌లో చేపలవేటకు వెళ్లాడు. కాగా ఇప్పటం గ్రామంలో ఓ దినం కార్యక్రమానికి వెళుతున్నానని సాల్మన్‌రాజు స్నేహితులతో చెప్పి అక్కడ నుంచి వెళ్లాడు. అనంతరం సాల్మన్‌రాజు పంట కాలువలో గురువారం మృతి చెందివుండడం చూచిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న తాడేపల్లి ఎస్ఐ ఖాజావలి శుక్రవారం మృతదేహాన్ని బయటకు తీయించి మార్చురీకి తరలించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఖాజావలి తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

తాడేపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం ఉండవల్లిలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కును టీడీపీ నాయకులు బాధితురాలి ఇంటికి వెళ్లి శుక్రవారం పంపిణీ చేశారు. ఉండవల్లికి చెందిన మసిపోగు భాగ్యరాణికి రూ.62985లు విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు దాసరి కృష్ణ, గాదె బసివిరెడ్డి వంగా నరేంద్ర, లాం నరేష్, భార్గవ్, పవన్, తదితరులు పాల్గొన్నారు. తాడేపల్లి మండలం పెనుమాకకు చెందిన మజీద్‌బికి రూ.58000లు, వేము మరియకృష్ణకు రూ.25350లు విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, కోట స్వర్ణలత, కొల్లి నాగార్జున, కోట పృధ్వి, షేక్ మీరావలి, ఖాదర్, రావూరి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై సర్వే

ఫిరంగిపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శిరంగిపాలెం, గొల్లపాలెం గ్రామాల్లో సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు మురుగు నీటిని తొలగించామని, ఇంటింటికి తిరిగి జ్వరాల సర్వే చేసినట్లు ఎంపీహెచ్‌ఎస్ అబ్దుల్ రెహ్మాన్, మలేరియా సబ్ యూనిట్ హెల్త్ అసిస్టెంట్ జే బాబూరావులు తెలిపారు. ఇంటింటికి వెళ్ళి రక్తపూతలు తీశారు. కార్యక్రమంలో కార్యదర్శి భాగ్యరాజు, కిరణ్, ఏఎన్ఎం వేళాంగిని, సువర్ణ సిబ్బంది పాల్గొన్నారు.

వర్షపు నీటి పారుదలకు చర్యలు చేపట్టాలని తహసీల్దార్‌కు వినతి

పెదనందిపాడు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పంట కాలువల్లో పూడిక తీయకపోవడంతో వర్షపు నీరు పంట పొలాల్లో నీరు నిలుస్తోందని రైతులు తహసీల్దార్ హేనాప్రియకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. నల్లమడ వాగు నుంచి చిలకలూరిపేట అడ్డరోడ్డు వరకు కాలువలు పూడిపోయి ఉన్నట్లు రైతులు తెలిపారు. దీనిపై తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. తహసీల్దార్ స్వయంగా వెళ్లి కాలువలను పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ, డ్రైనేజీ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు తుమ్మల సీతారామయ్య, తుమ్మల సుబ్బారావు, ధూళిపాళ్ల సుబ్బారావు, గద్దె చెంచురామారావు, పర్వతనేని సాంబయ్య, ప్రసాదు, లావు నాగరాజు, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు అందజేత



చిరువ్యాపారులకు తోపుడు బండ్లు అందజేస్తున్న టీడీపీ నాయకులు

తుళ్లూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చిరు వ్యాపారులకు టీడీపీ నాయకులు తోపుడు బండ్లను శుక్రవారం అందజేశారు. తుళ్లూరు గ్రామ మాజీ ఎంపీటీసీ మండల మాజీ టీడీపీ అధ్యక్షుడు జొన్నలగడ్డ కిరణ్ కుమార్ శుక్రవారం తుళ్లూరు హెచ్‌ఎస్ఆర్ కళ్యాణ మండపంలో 36 తోపుడు బండ్లను చిరు వ్యాపారులకు అందజేశారు. కార్యక్రమంలో తుళ్లూరు గ్రామ టీడీపీ అధ్యక్షుడు కాటా అప్పారావు, సొసైటీ డైరెక్టర్‌లు జమ్ముల అనిల్ కుమార్, పాటిబండ్ల జయకృష్ణ, కూటమి నాయకులు జె.సాంబశివరావు, కె.నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థులకు వ్యాపార అవకాశాలపై అవగాహన

వట్టిచెరుకూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వింజనంపాడు సమీపంలోని కిట్స్ కళాశాలలో ఈసెల్ బిడ్ అలర్ట్ కంపెనీల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు టెండరింగ్, కాంట్రాక్టర్ల నిర్వాహణపై శుక్రవారం ఒక రోజు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి జీ విజయకుమార్, జానీమూన్, బీ స్టీవెన్‌కుమార్ వంటి బిడ్ అలర్ట్ ప్రముఖులు హాజరై పారిశ్రామిక వేత్తలుగా మారటంపై ప్రజెంటేషన్, టెండరింగ్ పొందే విధానం జెమ్ పోర్టల్ ఉపయోగం, కాంట్రాక్టర్ల వ్యూహంపై నిర్మాణాత్మకంగా వివరించారు.

కిట్స్ కళాశాలలో ముగిసిన ఐదు రోజుల హ్యాక్‌థాన్



సర్టిఫికెట్లు అందజేస్తున్న చైర్మన్ కోయ సుబ్బారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ బాబు

వట్టిచెరుకూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కిట్స్ కళాశాలలో సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌లో నిర్వహిస్తున్న ఐదు రోజుల హ్యాక్‌థాన్ శుక్రవారం ముగిసింది. కార్యక్రమంలో 41టీమ్‌లు పాల్గొని వివిధ రంగాలకు చెందిన వినూత్నమైన ఆవిష్కరణలను ఆవిష్కరించారు. జ్యూరీ ప్రతినిధులు లోకేశ్, మిలట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో అండ్ ఫౌండర్ ప్రవీణ్ కుమార్, డిజైన్ ఇంజనీరింగ్ ప్రొడక్ట్ ఎక్స్‌పర్ట్ ఈ ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీ బాబు, సీఎస్ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్.రమేష్ అధ్యక్షత వహించారు. అనంతరం విద్యార్థులకు చైర్మన్ కోయ సుబ్బారావు సర్టిఫికెట్లు అందజేశారు.

ఓజీ సినిమా విజయోత్సవం

గుంటూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పవన్ కల్యాణ్ నటించిన ఓజీ సినిమా విజయవంతం కావడంతో జనసేన, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం పలకలూరులో జరిగిన వేడుకల్లో ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు పాల్గొన్నారు. ముందుగా జనసేన ప్రత్తిపాడు సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు నేతృత్వంలో భారీ వాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఎస్.సునీల్‌కుమార్, వడ్రాణం మార్కండేయ, నాయబ్ కమాల్, డి.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయిని కావాలనే కలనెరవేరింది: కౌసర్

దుగ్గిరాల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వివాహం విద్యకు అడ్డుకాదని సాటివారికి ఆదర్శంగా నిలిచింది షేక్ షాహిన్‌కౌసర్. రాష్ట్రంలో జరిగిన మెగా డీఎస్సీలో రెండు ఉద్యోగాలను ఏకకాలంలో పొందిన దుగ్గిరాల గ్రామం ముర్తుజానగర్‌కు చెందిన షేక్ షాహిన్‌కౌసర్ నియామక పత్రాన్ని అందుకుంది. కుమార్తెను ఉపాధ్యాయనిగా చూడాలనే కోరిక నెరవేరిందని తండ్రి సుభాని ఆనందం వ్యక్తం చేశాడు.

విద్యుత్ స్తంభం వద్ద మంటలు

తాడేపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పరిధిలోని ఉండవల్లి సెంటర్ డౌన్‌లో ఉన్న విద్యుత్ స్తంభానికి శుక్రవారం మంటలు చెలరేగాయి. స్థానికంగా ఉన్న ఓ స్కూలు ఎదురుగా తెల్లవారుజామున ఈ ఘటన జరగడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. విద్యుత్ స్తంభాలకు కరెంటు వైర్లు కాకుండా లెక్కలేకుండా వేలాడుతున్న వైర్లు షార్ట్ సర్క్యూట్ అయి మంటలు చెలరేగాయని స్థానికులు తెలిపారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి నియోజకవర్గంలో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వైనేతాజీ డిమాండ్ చేశారు. మంగళగిరి సీపీఎం కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం జిల్లా నాయకుల విస్తృత సమావేశం వీసం జవహర్‌లాల్ అధ్యక్షతన జరిగింది.

నేటి నుంచి గంగానమ్మ వార్షికోత్సవాలు

దుగ్గిరాల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల గ్రామం చిలువూరులోని గంగానమ్మ దేవాలయ 13వ వార్షిక ఉత్సవాలు ఈ నెల 27వ తేదీ శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. 12ఏళ్లగా గ్రామానికి చెందిన బయోఫర్ అధినేత డాక్టర్ రంగిశెట్టి జగదీష్ బాబు సౌజన్యంతో ఏటా మూడ్రోజులపాటు వైభవంగా నిర్వహిస్తూ వచ్చారు. 27వతేదీ ఉదయం మహాభిషేకం, సాయం త్రం దీపాలంకరణ, 28వతేదీ ఆదివారం శ్రీగంగానమ్మ తల్లి జాతర, ఊరేగింపు నిర్వహించనున్నారు. 29వ తేదీ సోమవారం అమ్మవారికి 101చీరెలతో అలంకరణ, పుష్పార్చన, అనంతరం అన్నసంతర్పణ చేయనున్నారు. శుక్రవారం జరిగిన పూజాకార్యక్రమాల్లో డాక్టర్ జగదీష్ బాబు, సుభాషిణి దంపతులతోపాటు, డాక్టర్ రమేష్‌బాబు, ఎస్.వీరన్న, పద్మజ్యోతి దంపతులు పాల్గొన్నారు.

ఓజోన్ పొర రక్షణపై అవగాహన

తాడేపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఓజోన్ పొర పరిరక్షణపై కేఎల్ యూనివర్సిటీ విద్యార్థి విభాగం అధికారి డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రాతూరులో అవగాహన కల్పించారు. యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్, ఈసీఈ విభాగం వలంటీర్లు అవగాహన కల్పించారు.

భూసారాన్ని పరీక్షించి ఎరువులు వాడాలి

ఫిరంగిపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఫిరంగిపురం, తక్కెళ్ళపాడు, శిరంగిపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం శుక్రవారం జరిగింది. గుంటూరు సహాయ వ్యవసాయ సంచాలకులు మోహనరావు భూసార పరీక్షల ఆధారంగానే ఎరువులు వాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏవో కే వాసంతి రైతులకు భూసార పరీక్షల ఫలితాల పత్రాలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎస్‌వో శివ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

తాడేపల్లిలో ఫ్రైడే డ్రై డే

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని నవోదయ కాలనీ, క్రిస్టియన్‌పేట వద్ద శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ కమిషనర్ అలీం భాష పర్యటించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీవిద్య, శివప్రసాద్ పాల్గొన్నారు.

113 తాళ్లూరులో వాటర్ ప్లాంట్ సీజ్

ఫిరంగిపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 113 తాళ్ళూరులోని డేగల వెంకటేశ్వరరావు నిర్వహించే ఆర్‌వో వాటర్ ప్లాంట్‌ను మండల పరిషత్ అధికారులు మూసివేయించారు. ఈ ప్లాంట్‌లోని నీటిలో ఎన్‌పీఎం కోలీ ఫాం బ్యాక్టీరియా శాతం ఎక్కువగా ఉన్నందున జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఆర్‌వో ప్లాంట్‌ను సీజ్ చేశామని ఇన్‌చార్జ్ ఎంపీడీవో కే రవిబాబు తెలిపారు. వాటర్ ప్లాంట్ నుంచి వచ్చే తాగు నీటిని ప్రజలు వినియోగించుకోవద్దన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ పీ వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు పీ వెంకటరావు, జోజిబాబు, వెంకటేశ్వరరావులు ఉన్నారు.

ఫర్నీచర్ ఆటోను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై రోడ్డు మార్జిన్‌లో ఆపివున్న ఫర్నీచర్ ఆటోను ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో ఆటోలో ఉన్న ఒక వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని తుమ్మలపాలెం వద్ద జరిగింది. ప్రత్తిపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ నుంచి ప్లాస్టిక్ కుర్చీల లోడుతో తిరుపతికి పొదిలి మోషే, మనూరి త్రినాథ్‌లు ట్రాలీ ఆటోలో వెళ్తున్నారు. అర్ధరాత్రి తరువాత ఆటో నడుపుతున్న మోషే కాలకృత్యాల కోసం గుంటూరు - చిలకలూరిపేట జాతీయ రహదారిపై తుమ్మలపాలెం వద్ద ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు మార్జిన్‌లో ఆటోను ఆపాడు. మోషే కిందకు దిగగా ఆటోలో త్రినాథ్ ఉన్నాడు. అదే సమయంలో కనిగిరి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రోడ్డు మార్జిన్‌లో ఉన్న ఆటోను ఢీకొంది. దీంతో ఆటోలో ఉన్న త్రినాథ్‌కు గాయాలు కాగా 108 అంబులెన్సులో చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు త్రినాథ్ ఇచ్చిన పిర్యాదు మేరకు ప్రత్తిపాడు హెడ్ కానిస్టేబుల్ రాజేష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారుని ఢీకొట్టిన ద్విచక్ర వాహనం... ఒకరికి గాయాలు

తుళ్లూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద పరిమి-నీరుకొండ రోడ్డులో ఎదురుగా వస్తున్న కారును ద్విచక్ర వాహనం ఢీట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నీరుకొండలో పని చేస్తున్న కంచర్ల ముక్కంటి భార్యని తీసుకువచ్చేందుకు వెళుతుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి కారును ఢీకొట్టటంతో ముక్కంటికి తీవ్ర గాయాలైయ్యాయి. బాధితుడిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. కారు డ్రైవర్ వైపు ముందు భాగం దెబ్బతింది. తుళ్లూరు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీఏఎస్ కళాశాలను పరిశీలించిన ఏఎన్‌యూ కమిటీ

పెదనందిపాడు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీఏఎస్ కళాశాలను ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అఫిలియేషన్ సభ్యులు శుక్రవారం పరిశీలించారు. కమిటీ సభ్యులు జి నాగరాజు, వెంకటపద్మజ, ప్రిన్సిపాల్ జి.వీరరాఘవయ్యను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

సచివాలయంలో తహసీల్దార్ ఆకస్మిక తనిఖీ

పెదనందిపాడు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉప్పలపాడు గ్రామ సచివాలయాన్ని శుక్రవారం తహసీల్దార్ హేనాప్రియ ఆకస్మిక తనిఖీచేసి రికార్డులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఆమె వెంట ఆర్ఐ షేక్ అబీద్, సిబ్బంది ఉన్నారు.